ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక


Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 231
బుధవారం 02 సెప్టెంబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## ఏపీ మహిళలకు చంద్రబాబు గుడ్ న్యూస్...
### ఏపీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

త్వరలో ఏపీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటన
సంక్షేమంతో పాటు అభివృద్ధే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం
మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు వైసీపీ 350 కేసులు వేసిందని విమర్శ
ఇప్పటివరకు పింఛన్ల రూపంలో రూ.73,000 కోట్లు అందించామని వెల్లడి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 01)
ఆంధ్రప్రదేశ్ మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపి కబురు అందించారు. రాష్ట్రంలో త్వరలో పెద్ద ఎత్తున అందుబాటులోకి రానున్న ఏపీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. మొగల్తూరులో నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధే తమ ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పింఛన్ల రూపంలోనే ప్రజలకు రూ. 73,000 కోట్లు అందించినట్లు గుర్తుచేశారు. మహిళలు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారి కష్టాలను తీర్చేందుకే 'దీపం' పథకాన్ని తీసుకువచ్చామని వివరించారు. ఇదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీని అడ్డుకోవాలనే లక్ష్యంతో ఏకంగా 350 కేసులు వేశారని ▶మిగతా 2లో

## ప్రపంచం తడబడుతున్నా.. భారత్ దూసుకెళ్తోంది: పవన్ కల్యాణ్

తొలి త్రైమాసికంలో భారత్ జీడీపీ 7.8% వృద్ధి
వృద్ధి దేశ ఆర్థిక బలానికి నిదర్శనమన్న పవన్
ప్రపంచ అనిశ్చితిపై భారత్ స్థైర్యం చాటిందని వెల్లడి
మోదీ నాయకత్వాన్ని ప్రశంసించిన పవన్ కల్యాణ్
డిజిటల్ రంగం, మౌలిక వసతుల్లో పురోగతి ఉందని వ్యాఖ్య



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 01)
భారత్ జీడీపీ 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు చేయడం దేశ ఆర్థిక స్థైర్యం, విశ్వాసానికి నిదర్శనమని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, భౌగోళిక ఉద్రిక్తతలు, చమురు ధరల్లో హెచ్చుతగ్గులు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు కొనసాగుతున్నా భారత్ తన బలాన్ని చాటుకుందని పేర్కొన్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ మంగళవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. జీడీపీ వృద్ధి కేవలం ఒక సంఖ్య కాదని, దేశ ప్రజల సమష్టి శక్తిని ప్రతిబింబిస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సవాళ్లను అవకాశాలుగా మార్చుకుంటూ దేశం ముందుకు సాగుతోందన్నారు. 2014 నుంచి భారత్ ఆర్థికంగా మరింత బలపడిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. స్వయం సమృద్ధి, డిజిటల్ రంగం, మౌలిక వసతుల అభివృద్ధిలో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. యువత పెద్ద కలలు కనడంతో పాటు ఆవిష్కరణలు, వ్యాపారాలు, సాంకేతిక రంగంలో ముందుకు సాగేందుకు అవకాశాలు పెరిగాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నా భారత్ ▶ 2లో



## వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయి: నారాయణ

నిబంధనలు, కోర్టు ఆదేశాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటామన్న నారాయణ
ఓటమి భయంతోనే వైసీపీ నేతలు కోర్టులను ఆశ్రయిస్తున్నారని ఎద్దేవా
అభ్యర్థులు కూడా లేని దయనీయ పరిస్థితుల్లో వైసీపీ ఉందని వ్యాఖ్య

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 01)
వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కోర్టుల్లో కేసులు వేసినా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయని ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నిబంధనలు, న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగానే ఎన్నికల నిర్వహణపై నిర్ణయాలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో ఇప్పటికే రూ. 3,300 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించామని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని ▶మిగతా 2లో

## పులివెందులలో జగన్ కు ఘనస్వాగతం పలికిన వైసీపీ శ్రేణులు

రెండు రోజుల పర్యటన నిమిత్తం పులివెందుల చేరుకున్న జగన్
తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన వైసీపీ అధినేత
రేపు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 01)
వైసీపీ అధినేత జగన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం పులివెందులకు చేరుకున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో సాగనున్న ఈ పర్యటనలో భాగంగా ఈరోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆయన పులివెందుల చేరుకోగా... హెలిప్యాడ్ వద్ద పార్టీ నాయకులు, స్థానిక శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు.



పర్యటనలో భాగంగా జగన్ భాకరాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహించారు. సొంత నియోజకవర్గం పులివెందులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తూ, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ రాత్రికి ఆయన పులివెందులలోని తన స్వగృహంలోనే బస చేయనున్నారు. రేపు ఉదయం 7.45 గంటలకు జగన్ 2

## సింధు జలాల వివాదం.. నీటిని ఆయుధంగా వాడొద్దన్న పాకిస్థాన్ ప్రధాని

ఎస్‌సీఓ సదస్సులో సింధు జలాల ఒప్పందంపై పాక్ ప్రధాని ప్రస్తావన
నీటిని రాజకీయ ఆయుధంగా వాడరాదని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్య
హేగ్ మధ్యవర్తిత్వ కోర్టు తీర్పును తీవ్రంగా వ్యతిరేకించిన భారత్
పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఒప్పందాన్ని నిలిపివేసినట్లు స్పష్టం చేసిన ఇండియా



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 01)
షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు వేదికగా భారత్-పాకిస్థాన్ మధ్య సింధు జలాల ఒప్పందం వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. మంగళవారం ఈ అంశాన్ని ప్రస్తావించిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, నీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ అస్త్రంగా మలుచుకోకూడదని భారత్‌ను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ ఒప్పందాలను వాటి అసలు స్ఫూర్తికి అనుగుణంగా అమలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హేగ్‌లోని శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం సింధు జలాల ఒప్పందం చెల్లుబాటును సమర్థిస్తూ, వివాద పరిష్కార యంత్రాంగం కొనసాగుతుందని తీర్పు వెలువరించిన మరుసటి రోజే షెహబాజ్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత 2


## విజయసాయిరెడ్డిని సజ్జల కొట్టింది నిజమే
### కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, అమరావతి, సెప్టెంబర్ 01)
'దేశవిదేశాల నుంచి ఆంధ్రులు వచ్చి ఓట్లు వేసి కూటమిని గెలిపించారు. కూటమి ప్రభుత్వ ఘనవిజయం ఒకచరిత్ర.. వైకాపా ఘోర పరాజయం కూడా చారిత్రకఘట్టం' అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియా మాట్లాడుతూ.. కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ వైకాపా వికృత రాజకీయం చేస్తుందన్నారు. హిందు మతానికి ఘోర అన్యాయం జరిగిందని ఎలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆలయాల్లో రథాలు తగులబడినప్పుడు, విగ్రహాల తలలు తెగ్గొట్టినప్పుడు, సింహాలు చోరీకి గురైనప్పుడు వైకాపా నేతల నోళ్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఏపీని అస్థిరం చేయాలని ఓ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పరిశ్రమలు, పెట్టుబడులు రాకూడదని ఫేక్ వీడియోలతో ప్రచారాలు చేస్తే.. చూస్తూ ▶మిగతా 2లో


## ఉగ్రవాదం వ్యూహాత్మక సంపద కారాదు
### : పాక్ పీఎంకు సూటిగా చెప్పిన మోదీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 01)
ఉగ్రవాదాన్ని ఎగదోసే దాయాది పాకిస్థాన్‌కు భారత్ ఎప్పటికప్పుడు గట్టి హెచ్చరికలు చేస్తోంది. కిర్గిస్థాన్‌లో షాంఘై సహకార సంస్థసదస్సు వేదికగా ప్రధాని మోదీ పొరుగుదేశానికి గట్టి సందేశం పంపారు. ఉగ్రవాదం వ్యూహాత్మక సంపద కారాదన్నారు. ఉగ్రవ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని, ద్వంద్వ ప్రమాణాలకు తావుండకూడదని పిలుపునిచ్చారు. మోదీ ఈ సందేశం ఇచ్చిన సమయంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అక్కడే ఉన్నారు."తీవ్రమైన అంశాలపై అందరిదీ ఒకే మాట ఉండాలి. ఉగ్రవాదాన్ని ఒక విధానంగా ఉపయోగిస్తూ, ఉగ్రమూకలకు ఆశ్రయం కల్పించే దేశాలకు గట్టి సందేశం ఇవ్వాలి. ఉగ్రవాదం ఎవరికీ వ్యూహాత్మక సంపద కారాదని తేల్చిచెప్పాలి" అని మోదీ పేర్కొన్నారు. అలాగే నేటి పరస్పర అనుసంధాన ప్రపంచంలో భద్రతా పరిధి మరింత విస్తృతమైందన్నారు. పశ్చిమాసియా సంక్షోభం అందుకు నిదర్శనమని చెప్పారు. "ఆ ప్రాంతంలో మొదలైన ఘర్షణ అక్కడికే పరిమితం కాలేదు. ఇంధన భద్రత, సముద్ర వాణిజ్యం, సరఫరా గొలుసులు ప్రభావితమయ్యాయి" అని చెప్పారు. అందుకే యుద్ధభూమిలో కాకుండా చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని మరోసారి సూచించారు. ఇరాన్ యుద్ధం , ఉక్రెయిన్-రష్యా యుద్ధం నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. మాదకద్రవ్యాల అక్రమరవాణా గురించి కూడా ప్రస్తావించారు. "డ్రగ్స్ అక్రమ రవాణా నేరం మాత్రమే కాదు. యువతకు, ప్రాంతీయ భద్రతకు ఒక తీవ్రమైన ముప్పు" అని హెచ్చరించారు.



2

## నేపాల్ విపత్తును ముందే పసిగట్టిన 'నైసర్' శాటిలైట్.. విమర్శల్లో పసలేదు!



నేపాల్ విపత్తుపై ముందే కీలక డేటా అందించిన 'నైసర్' శాటిలైట్
విమర్శల నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన వాస్తవాలు
కొండచరియల్లో మార్పులను వారాల ముందే గుర్తించిన రాడార్
చైనా పరిశోధకుడి విశ్లేషణలో కీలక విషయాల వెల్లడి
ఇస్రో-నాసా సంయుక్తంగా అభివృద్ధి చేసిన శక్తిమంతమైన ఉపగ్రహం నైసర్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 01)
నేపాల్‌లో ఇటీవల సంభవించిన ఘోర విపత్తు నేపథ్యంలో, ఇస్రో-నాసా సంయుక్తంగా రూపొందించిన 'నైసర్' ఉపగ్రహం పనితీరుపై వచ్చిన విమర్శలు నిరాధారమని తేలింది. విపత్తును ముందుగా హెచ్చరించడంలో ఈ శక్తిమంతమైన శాటిలైట్ విఫలమైందన్న ఆరోపణలను తాజా విశ్లేషణలు పటాపంచలు చేశాయి. విపత్తు సంభవించడానికి కొన్ని వారాల ముందే నైసర్ స్పష్టమైన హెచ్చరిక సంకేతాలను పంపిందని వెల్లడైంది. ▶మిగతా 2లో

**మొదటి పేజీ తరువాయి**

## ప్రపంచం తడబడుతున్నా.. భారత్ దూసుకెళ్తోంది: పవన్ కల్యాణ్

అభివృద్ధి పథంలో కొనసాగుతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచ వేదికపై దేశానికి విశ్వసనీయత, ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్నారు. బలమైన, స్వయం సమృద్ధి, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే దేశంగా 'వికసిత్ భారత్' దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపారు.

## వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయి: నారాయణ

చూసి తట్టుకోలేక ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు కోర్టులను ఆశ్రయిస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా లేని దయనీయ స్థితిలో ఆ పార్టీ ఉందన్న ఆయన... అందుకే రాష్ట్రంలో ఎక్కడా ఎన్నికలు ఏకగ్రీవం కాకూడదని జగన్ తన నేతలకు హుకుం జారీ చేశారని ఎద్దేవా చేశారు.ఇదే సమయంలో... భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, వెలిగొండ ప్రాజెక్టుల క్రెడిట్ తమదేనని వైసీపీ నేతలు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాలను, నిర్లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో తీసుకెళ్తోందని వివరించారు. నెల్లూరు నగరంలో కాలువల కట్టలపై ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు శాశ్వత పట్టాలు మంజూరు చేసే అంశంపై త్వరలోనే ప్రభుత్వం తీపి కబురు అందిస్తుందని హామీ ఇచ్చారు.

## సింధు జలాల వివాదం.. నీటిని ఆయుధంగా వాడొద్దన్న పాకిస్థాన్ ప్రధాని

సంతరించుకుంది.అయితే, ఈ న్యాయస్థానం తీర్పును భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. అసలు, ఆ కోర్టు ఏర్పాటే చట్టవిరుద్ధమని, దాని పరిధిని తాము గుర్తించబోమని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. సదరు ట్రైబ్యునల్ విచారణలో భారత్ పాల్గొనలేదని, ఆ తీర్పులు తమ జలవిద్యుత్ ప్రాజెక్టులపై ఎలాంటి ప్రభావం చూపబోవని తేల్చిచెప్పింది.2025 ఏప్రిల్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. తాజా తీర్పు వెలువడినప్పటికీ, ఈ విషయంలో తన వైఖరిలో ఎలాంటి మార్పు లేదని భారత్ పునరుద్ఘాటించింది.

ఇదే ఎస్‌సీఓ సదస్సులో ప్రసంగించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఉగ్రవాదంపై పోరాటంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించడం తగదని హెచ్చరించారు. ఉగ్రవాదానికి అందుతున్న నిధులు, నియామకాలు, సురక్షిత స్థావరాలను కూకటివేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. ఈ పరిణామాలతో భారత్-పాకిస్థాన్ మధ్య ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్తతల మధ్య సింధు జలాల వివాదం మరోసారి కీలక అంశంగా మారింది.

## విజయసాయిరెడ్డిని సజ్జల కొట్టింది నిజమే

ఊరుకోమని హెచ్చరించారు. వైకాపా క్రెడిట్ చోరీ చూస్తుంటే నాగార్జునసాగర్, సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టులు కట్టింది జగన్ అని చెప్పేట్టు ఉన్నారని ఎద్దేవా చేశారు."విజయసాయిరెడ్డి నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు ఎంత నీచంగా, ఘోరంగా మాట్లాడారో అందరికీ తెలుసు. విజయసాయిని సజ్జల కొట్టింది నిజమే. మంగళగిరిలో ప్లీనరీ జరిగేటప్పుడు వేదికపై ఎవరితో మాట్లాడించాలనే దానిపై ఇద్దరి మధ్య వివాదం తలెత్తి, మాటామాటా పెరిగి కొట్టింది వాస్తవమే. విజయసాయిరెడ్డి 72 అవమానాలు జరిగాయని చెప్పారు. నాకు ఒక్కడికే తెలిసి మరో ఘోర అవమానం జరిగింది. తన సొంతూరైన తాళ్లపూడికి వచ్చినప్పుడు.. కాకుపల్లి సెంటర్‌లో వంద వాహనాలతో ఘనంగా స్వాగతం పలికారు. దానిపై విజయసాయిని సజ్జల నీచాతినీచంగా దూషించారు. ఆ మాటలు నా నోటితో నేను చెప్పలేను" అని కోటంరెడ్డి తెలిపారు.

## నేపాల్ విపత్తును ముందే పసిగట్టిన 'నైసర్' శాటిలైట్.. విమర్శల్లో పసలేదు!

చైనాలోని చాంగాన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థి జెన్‌షియాంగ్ లియు, నైసర్ చిత్రాలను విశ్లేషించి ఈ కీలక విషయాలను వెల్లడించాడు. విపత్తు సంభవించడానికి కొన్ని వారాల ముందే ప్రమాదకర ప్రాంతంలోని పర్వత వాలులో భారీ మార్పులు చోటుచేసుకున్నట్లు అతడు గుర్తించాడు. అక్కడి మంచు, రాతి పొరలు తీవ్ర ఒత్తిడికి గురై, ఆ ప్రాంతం ఏకంగా కొన్ని మీటర్ల మేర పక్కకు జరిగినట్లు తేలింది. ఈ కదలికలు ఒకేచోట కేంద్రీకృతం కావడం, రాబోయే కొండచరియల విపత్తుకు స్పష్టమైన సంకేతమని లియు తన విశ్లేషణలో పేర్కొన్నాడు.భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) సంయుక్తంగా ఈ 'నైసర్' (నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్) ఉపగ్రహాన్ని అభివృద్ధి చేశాయి. ప్రకృతి వైపరీత్యాలను ముందే గుర్తించి, హెచ్చరికలు జారీ చేసే లక్ష్యంతో దీన్ని గత ఏడాదే ప్రయోగించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన భూ పరిశీలన ఉపగ్రహాల్లో ఒకటి. మేఘాలు, వర్షం, పొగమంచు వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ పగలు, రాత్రి తేడా లేకుండా స్పష్టమైన చిత్రాలను తీయగల రెండు సింథటిక్ అపెర్చర్ రాడార్లను (ఎల్-బ్యాండ్, ఎస్-బ్యాండ్) కలిగి ఉన్న తొలి శాటిలైట్ ఇదే.ఈ వివరాల ప్రకారం, నైసర్ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించిందని, విపత్తుకు సంబంధించిన కీలక సమాచారాన్ని ముందే అందించిందని స్పష్టమవుతోంది. అయితే, ఆ సంకేతాలను సరైన సమయంలో విశ్లేషించి, తక్షణమే రక్షణ చర్యలు చేపట్టడంలోనే అసలు సవాలు ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## పులివెందులలో జగన్ కు ఘనస్వాగతం పలికిన వైసీపీ శ్రేణులు

ఇడుపులపాయకు బయల్దేరి వెళతారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, నివాళులు అర్పిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన తాడేపల్లికి తిరుగు ప్రయాణం కానున్నారు.

## ఉగ్రవాదం వ్యూహాత్మక సంపద కారాదు

ఈ సదస్సులో మోదీ, షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పాల్గొన్నారు. బెలారస్, కజకస్థాన్, ఉజ్బెకిస్థాన్, తజికిస్థాన్ దేశాల అధ్యక్షులు హాజరయ్యారు.

కరచాలనం చేసిన మోదీ, జిన్‌పింగ్..

ఎస్‌సీఓ సదస్సులో భాగంగా మోదీ, జిన్‌పింగ్ కరచాలనం చేశారు. వారితో రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా ముచ్చటించారు.

## ఏపీ మహిళలకు చంద్రబాబు గుడ్ న్యూస్...

ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో అభివృద్ధిని ఆపలేరని హితవు పలికారు. కేవలం ప్రజల ప్రయోజనాల కోసమే కూటమి పార్టీలు ఏకమయ్యాయని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రభుత్వం బాధ్యతాయుతంగా ముందుకు సాగుతోందని చంద్రబాబు పునరుద్ఘాటించారు.



## రేషన్ డీలర్లలో మార్పు రావాలి

### ప్రతినెల నూరు శాతం రేషన్ పంపిణీ జరగాలి
### వృద్ధులకు, వికలాంగులకు ఇంటికి వెళ్లి రేషన్ ఇవ్వాలి
### రేషన్ పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు
### ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, సెప్టెంబర్ 1)**

ప్రజా పంపిణీ వ్యవస్థ సామాన్యులకు అందుబాటులో ఉండాలంటే రేషన్ డీలర్ల వైఖరిలో మార్పు రావాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జివి ఆంజనేయులు అన్నారు. మంగళవారం వినుకొండ మునిసిపల్ కౌన్సిల్ హాల్ నందు నియోజకవర్గం రేషన్ డీలర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డీలర్ సేవా దృక్పథం, పారదర్శకత, కార్డుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం సమయపాలన పాటిస్తూ నిర్దేశించిన వేళలో షాపులను తెరిచి కార్డుదారులను ఇబ్బంది పెట్టకుండా గౌరవంగా సరుకులు పంపిణీ చేయాలని కోరారు. ప్రతినెల నూరు శాతం రేషన్ పంపిణీ జరగాలని, పంపిణీలో వెనుక పడితే రేషన్ షాపుల లైసెన్స్ ను రద్దు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి రేషన్ షాపులో కార్డు లబ్ధిదారునికి రేషన్ తప్పనిసరిగా ఇవ్వాలని, బియ్యం ఇవ్వను డబ్బులు ఇస్తానని ఫిర్యాదులు అందితే కేసులు తప్పవని హెచ్చరించారు. రేషన్ షాపు దూరంగా ఉన్న కార్డుదారులకు స్టాక్ పాయింట్ అనుమతి ఇచ్చి అక్కడే రేషన్ పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 60 సంవత్సరాలు దాటిన వృద్ధులు, వికలాంగులకు ప్రతినెల ఇంటికి వెళ్లి రేషన్ అందజేయాలని వివరించారు. బయోమెట్రిక్ వేలిముద్రలు పడని వారికి వీఆర్వో ద్వారా రేషన్ పంపిణీ జరుగుతుందని గుర్తు చేశారు. ఈ నెల నుండి నూరు శాతం రేషన్ పంపిణీ చేసి నియోజకవర్గ గౌరవాన్ని పెంచాలని ఆయన కోరారు. రేషన్ సరుకులు పక్కదారి పట్టించిన డీలర్లు మరియు సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా సకాలంలో మరియు పారదర్శకంగా రేషన్ అందించడమే కోటని ప్రభుత్వ లక్ష్యం అని అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని వివరించారు. ప్రతినెల ఆయా మండలాల తహసిల్దార్లు నిరంతరం రేషన్ డిపోలను, ఈపాస్ యంత్రాల రికార్డులను తనిఖీ చేసి ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టాలని చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ఆదేశించారు. సమావేశంలో ఐదు మండలాల తాసిల్దార్లు, రేషన్ షాపు డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.




## భూముల రీ సర్వే, పిజిఆర్ఎస్, 22ఏ అంశాల పై దిశా నిర్దేశం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 1)**

మంగళవారం ఉదయం అమరావతి నుంచి సీసీఎల్ఏ, స్పెషల్ సీఎస్ టు గవర్నమెంట్ జయలక్ష్మి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పి రాజబాబు క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె భూముల రీ సర్వే, పిజిఆర్ఎస్, 22 ఏ తదితర అంశాల పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ జీవోలు రెవెన్యూ కాన్ఫరెన్స్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎప్పటికప్పుడు ఆయా గ్రామాలలో తిరిగి మండల రెవెన్యూ అధికారి లాగిన్స్‌లో పిజిఆర్ఎస్ పెండింగ్ లేకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అక్టోబర్ నెల వరకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని తదనుగుణంగా ఒక సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. భూముల రీ సర్వే, పిజిఆర్ఎస్ లలో వెనుకంజలో ఉన్న మండలాల రెవెన్యూ అధికారులపై, మరియు అలసత్వం వహించిన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రీసెర్వె పూర్తి చేసిన గ్రామాలలో పట్టాదారు పాస్ పుస్తకాలు సత్వరమే అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించాలన్నారు. ప్రతి అర్జీ దారునితో ఫోన్లో విధగా మాట్లాడి వారి సంతృప్తి స్థాయి ని పెంచాలని సూచించారు. సెన్సస్ 2027 నిర్వహణ పై ప్రభుత్వ సూచనలు విధిగా పాటించి నిర్దేశిత గడువులోపల పూర్తి చాయాలని సంబందిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వెంకటరమణ, పి జి ఆర్ ఎస్ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.





## పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న దాదా



**(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 1)**

మండల కేంద్రమైన కంభం పంచాయతీ పరిధిలో గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశానుసారం 54 బూత్ పరిధిలోని జుమ్మా మసీద్, చిన్న మసీద్, మార్కెట్, అమ్మవారి శాల పరిసర ప్రాంతాల్లో ఒంగోలు పార్లమెంటు ముస్లిం మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ వార్డు మెంబర్ అత్తర్ షేక్ హుస్సేన్ (దాదా) ఇంటింటికి తిరిగి పింఛన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం ఝాన్సీ రాణి, తదితరులు పాల్గొన్నారు.

## అనాథల అంత్యక్రియలకు కంభం మానవతా సంస్థ అండ

### నూతన కార్యవర్గం ఎన్నిక
### జిల్లా డైరెక్టర్‌గా కాటమాల చెన్నకేశవరావు





**(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 1)**


కంభం మానవతా కార్యాలయంలో సంస్థ అధ్యక్షులు ప్రభుదాస్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంస్థ వైస్ చైర్మన్ కాటమాల చెన్నకేశవరావు మాట్లాడుతూ అనాథలుగా ఎవరైనా మృతి చెందితే, వారికి కంభం మానవతా సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు కార్యవర్గ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపి తీర్మానం చేశారు. అలాగే సంస్థ సభ్యత్వాన్ని మరింతగా పెంచాల్సిన అవసరం ఉందని, ప్రతి సభ్యుడు చురుకుగా పనిచేసి సంస్థను బలోపేతం చేయాలని సమావేశంలో సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికైన కాటమాల చెన్నకేశవరావును, జిల్లా సెక్రటరీగా ఎన్నికైన ఏసేబును కంభం మానవతా కార్యాలయంలో కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ మీనిగా ప్రసాద్, సెక్రటరీ పరమేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ టిప్పుఖాన్, డైరెక్టర్లు వరికుంట్ల వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, కొండయ్య, నాగేల్ల పాల్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన చాకిచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థినులు



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 1)**

మండలంలోని చాకిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. జనార్దన్ తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బడతల లక్ష్మి, పుల్లా పల్లవి రెడ్డి ఈ ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్‌కు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచారని పేర్కొన్నారు. 2025లో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం ఇటీవల ప్రకటించగా, ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు సంవత్సరానికి రూ.12,000 చొప్పున ఉపకార వేతనం అందజేయబడుతుందని తెలిపారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రావి సుధాకర్ విద్యార్థినుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామస్తులు ఘనంగా అభినందించారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు	తెలుగు దినపత్రిక
02.09.26 బుధవారం


# పేదల ముఖాల్లో చిరునవ్వులు చూడడమే ప్రభుత్వ ధ్యేయం

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి.**
**గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయం**
**నియోజకవర్గంలో 9 రోడ్లకు రూ. 22.50 కోట్లు మంజూరు**



**(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, సెప్టెంబర్ 1)** మంగళవారం కొండేపి నియోజకవర్గం, సింగరాయకొండ మండలం కాళికవాయ గ్రామంలో 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వయంగా పాల్గొని, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు. లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. "ప్రతి నెల 1వ తేదీన పేదల సేవలో ప్రభుత్వం" అనే ఆశయంతో ప్రతి నెల మొదటి రోజునే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 62 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు దాదాపు రూ.2,700 కోట్లకు పైగా సామాజిక భద్రత పింఛన్ల రూపంలో పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ, పేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. ప్రతి నెల 1వ తేదీ ఉదయమే లబ్ధిదారుల ఇంటి గుమ్మం వద్దకే అధికారుల ద్వారా పింఛన్ సొమ్మును ఎంతో పారదర్శకంగా చేరవేస్తున్నామని వివరించారు. పెంచిన పింఛన్ సొమ్ము లబ్ధిదారుల కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఊరటనిస్తోందని, ముఖ్యంగా వృద్ధులు మరియు దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా సమాజంలో స్వేచ్ఛగా, గౌరవప్రదమైన జీవితం గడపడానికి ఈ పథకం ఎంతో దోహదపడుతోందని హర్షం వ్యక్తం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రాజకీయా నికి అతీతంగా సంక్షేమ ఫలాలు అందించడమే తమ నైతిక బాధ్యతని, రాబోయే రోజుల్లో కూడా పేదల సంక్షేమానికి మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడతామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి హామీ ఇచ్చారు. మంత్రి చేతుల మీదుగా పింఛన్ అందుకున్న లబ్ధిదారులు సమయానికి సాయం అందిస్తున్న ప్రభుత్వం పట్ల తమ సంతోషాన్ని, కృతజ్ఞతలను వ్యక్తం చేశారు. కాళికవాయ - నందనవనం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన రాష్ట్రంలో సురక్షితమైన, మౌలిక వసతులతో కూడిన రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడం ద్వారానే ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకోసమే ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా కాళికవాయి గ్రామం నుండి నందనవనం వరకు రూ.1.73 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ఇరు గ్రామాల మధ్య రవాణా కష్టాలు తీరడమే కాకుండా, స్థానిక ప్రజలకు, రైతులకు తమ ఉత్పత్తులను సమీప మార్కెట్లకు తరలించడం ఎంతో సులభతరం కానుందని వివరించారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని అత్యంత కీలకమైన 9 రహదారుల పునర్నిర్మాణం మరియు అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖామాత్యులు పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.22.50 కోట్ల భారీ నిధులను మంజూరు చేశారని వెల్లడించారు. గతంలో

4

# నీ నోటి దూల నీకు రాజకీయ సమాధి చేసిద్ధి
# అధికారం కోసం ఐదు సంవత్సరాలకు ఒకసారి పార్టీ మార్చే వ్యక్తి మాగుంట

**సాయం చేసిన జగన్ నే వాడు వీడు అంటావా**
**ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి 8 శాతం నిధులు కూడా ఖర్చు చేయని వ్యక్తి మాగుంట**
**ఎంపీ పదవిని అడ్డుపెట్టుకొని సంపాదించిన ఆస్తులు బయట పెట్టమంటావా**
**ఒంగోలు ఎంపీ మాగుంట పై**
**వైసీపీ ఒంగోలు పార్లమెంటు సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఫైర్**




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టెంబర్ 1)** ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి నోటి దూలే మాగుంట కుటుంబానికి రాజకీయ సమాధి అవుతుందని వైసిపి ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అధికారం కోసం ఐదు సంవత్సరాలకు ఒకసారి పార్టీలు మార్చే మాగుంట దిగజారుడు మాటలు మాట్లాడటం సిగ్గుపడాల్సిన విషయమని విమర్శించారు. 2019 ఎన్నికలకు ముందు ఒంగోలు ఎంపీ సీటు కోసం జగన్ పంచన చేరి, జగన్ చరిష్మాతో గెలిచింది నీవు కాదా అని ప్రశ్నించారు. నేడు చంద్రబాబు నాయుడు పంచన చేరి సాయం చేసిన జగన్ ని వాడు వీడు అని సంబోధించి మాట్లాడటం మాగుంట దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అన్నారు. మాగుంట ని గెలిపించిన ▶4లో



# ఆహ్లాదకరంగా, సర్వాంగ సుందరంగా మామిడిపాలెం సమ్మర్ స్టోరేజీ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 1)** నగరంలోని మామిడిపాలెం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ 1 వద్ద సాయంకాలం ఆహ్లాదకర వాతావరణం నెలకొంటోంది. సాయంత్రం వేళ సమ్మర్ స్టోరేజ్ పై వాకింగ్ చేస్తున్న ప్రజలకి కనిపిస్తున్న దృశ్యాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి...ఆ దృశ్యాలను షణ్ముఖ వెలుగు దినపత్రిక స్టాఫ్ ఫొటో గ్రాఫర్ తన కెమెరాలో ఇలా బంధించాడు.

# నిర్వాసితులు దైవంతో సమానం

**ఆగస్టు 31ని ప్రతి సంవత్సరం**
**ఒక పండుగ వాతావరణంలా జరుపుకోవాలి**
**ఇచ్చిన మాట కట్టుబడి వెలుగొండ**
**ప్రాజెక్టునుండి నీళ్లు విడుదల చేశాం**
**విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 1)** నిర్వాసితులు దైవంతో సమానమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని జవహర్ నగర్ లో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం జిల్లా సాధన వంటి హామీలు ఇచ్చి ఇప్పుడు వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి జాతికి అంకితం చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాంత ప్రజల పాలిటి దైవం అయ్యారని నిన్న వేలాదిమంది ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి విచ్చేసి కళ్ళారా ఆ దృశ్యాన్ని తిలకించి ఆనంద భాష్పాలు రాల్చారని, ఇది తన కళ్ళారా చూశానన్నారు. 23 లక్షల మందికి త్రాగునూరు అందించే ఈ బృహత్తర వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా ఏడు గ్రామాల నిర్వాసితులు గ్రామాలు ఖాళీ చేయవలసి వచ్చిందని ఆ త్యాగధనులకు ఈ 23 లక్షల మంది ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతారని అన్నారు. వారి త్యాగాలు వెలకట్టలేనివని, దేవుళ్లను పూజించినట్లు నిర్వాసితులను కూడా ప్రతిరోజు గుర్తు తెచ్చుకోవాలని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నీటి విడుదలతో ఈ ప్రాంత రూపురేఖలు త్వరలో మారనున్నాయని అన్నారు. మీడియా సమావేశంలో తెలుగుదేశం నాయకులు, మార్కాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వక్కలగడ్డ మల్లికార్జున, నాయకులు తాళ్లపల్లి సత్యనారాయణ, కౌన్సిలర్ నాలి కొండయ్య, పట్టణ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# మార్కాపురం ప్రజల 30 ఏళ్ల కల నెరవేరింది

**రూ.175 కోట్లతో ఆర్అండ్ఆర్, అదనపు పరిహారం జీవోలు విడుదల**
**అర్హులైన ప్రతి నిర్వాసిత కుటుంబానికి న్యాయం చేస్తాం**
**నాలుగు జిల్లాల పరిధిలోని 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు,**
**23 లక్షల మందికి తాగునీరు**
**మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 1)** మార్కాపురం ప్రాంత ప్రజలతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు సుమారు 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు (నల్లమల సాగర్) జలాలు అందుబాటులోకి రావడం ఒక చారిత్రాత్మక ఘట్టమని మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టును విజయవంతంగా ప్రారంభించిన సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను విడుదల చేయడంతో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల సాకారమైందని సంతోషం వ్యక్తం చేశారు. 1996 మార్చి 5న రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టు, 30 ఏళ్ల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రి చేతుల మీదుగానే జాతికి అంకితం

4



**నీ నోటి దూల నీకు రాజకీయ సమాధి చేసిద్ధి**

# అధికారం కోసం ఐదు సంవత్సరాలకు ఒకసారి పార్టీ మార్చే వ్యక్తి మాగుంట

ఒంగోలు ప్రజలకు ఏనాడు మేలు చేయని వ్యక్తి అన్నారు. ఒంగోలు ప్రజలకు ఆయనకు ఎన్నికల సమయంలోనే మనుషులుగా గుర్తిస్తారన్నారు. ఎంపీ నిధులు రూ.5 కోట్లు వస్తుంటే వాటిల్లో కనీసం 8 శాతం నిధులు కూడా ఒంగోలు అభివృద్ధి కోసం ఖర్చు చేయని వ్యక్తిగా ఒంగోలు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి నిలిచారన్నారు. అభివృద్ధి చేయలేని, సహాయం చేయలేని, ప్రజల శ్రేయస్సు కోరుకొని ఒంగోలు ఎంపీ మాగుంటను ఒంగోలు ప్రజలు ఛీదరించుకునే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఎంపీ పదవిని అడ్డుపెట్టుకొని చేస్తున్న లిక్కర్ వ్యాపారం, పైరవీలు, ఆస్తులు, ఆదాయాలు, పరిశ్రమల చిట్టాను బయట పెట్టమంటావా అని హెచ్చరించారు. మంచితనాన్ని బలహీనతగా భావించొద్దన్నారు. రెడ్డి అంటే పెద్దరికం, హుందాతనం, రెడి టు హెల్ప్ వంటి వారన్నారు. నిన్ను రెడ్డిగా జిల్లా ప్రజలు గుర్తించడం లేదని అన్నారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును తెచ్చింది కట్టింది, నీరిచ్చింది నాడు వైయస్సార్, ఆ తర్వాత జగన్ మాత్రమే అన్నారు. అది అబద్ధం అని మాగుంట వారి భార్య, పిల్లల పై ఒట్టు వేయగలరా అని చాలెంజ్ విసిరారు. జగన్ ను దూషించటం ద్వారా జిల్లా ప్రజల మనసును మాగుంట గాయం చేశారన్నారు. మీ నోటి దూలే మాగుంట కుటుంబానికి సమాధి అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో వైసిపి ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ చుండూరి రవిబాబు, కొత్తపట్నం మండల పార్టీ అధ్యక్షులు అంజిరెడ్డి, భూమిరెడ్డి, రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం ప్రజల 30 ఏళ్ల కల నెరవేరింది

కావడం ఎంతో శుభపరిణామని పేర్కొన్నారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లాపూర్ వద్ద నుంచి 43.50 టీఎంసీల కృష్ణా వరద జలాలను 18 కిలోమీటర్ల పొడవైన జంట సొరంగాల ద్వారా తరలించి, 21 కిలోమీటర్ల ఫీడర్ కాలువ ద్వారా నల్లమల సాగర్‌కు పంపిస్తున్నారని తెలిపారు. 4 జిల్లాల పరిధిలోని ముఖ్య మండలాల్లో 4.4 లక్షల ఎకరాలకు సాగునీరు, దాదాపు 23 లక్షల మంది ప్రజలకు శాశ్వత తాగునీటి సదుపాయం లభిస్తుందని వివరించారు. ఫ్లోరైడ్ రహిత నీటి సదుపాయంతో పాటు రాయలసీమ హార్టికల్చర్ హబ్‌లో మార్కాపురం భాగం కావడం ద్వారా ఆర్థిక, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని స్పష్టం చేశారు. నల్లమల సాగర్ జలాశయంలో సుంకేసుల, గొట్టిపడియ, కాకర్ల గ్యాప్‌లను పూరించడం ద్వారా 53.85 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యాన్ని అందుబాటులోకి తెచ్చామని తెలియజేశారు. నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రాజెక్టు పరిధిలోని 11 ముంపు గ్రామాల నుంచి 7,321 నిర్వాసిత కుటుంబాలను 7 ఆర్ అండ్ ఆర్ కాలనీలకు తరలించడం జరుగుతోందని వెల్లడించారు. ఇప్పటికే 85% నుండి 90% మందికి (6,200 పైగా కుటుంబాలకు) అవార్డులు పూర్తి చేసి నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. కేవలం 312 వివాదాస్పద, కోర్టు కేసులు, పత్రాల సమర్పణ లేనివి మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అదనపు అర్హులైన నిర్వాసితులకు (మేజర్ సన్స్, డాటర్స్, గెజిట్‌లో పేర్లు మిస్సయిన వారు) పరిహారం అందించేందుకు ప్రభుత్వం రూ.165 కోట్లతో జీవో విడుదల చేసిందని వ్యాఖ్యానించారు. మేజర్ కుమారులు, కుమార్తెలకు రూ. 2 లక్షల చొప్పున సాయం అందుతుందని తెలియజేశారు. 10,000 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకుల కిట్‌లు (రూ.3 కోట్లు), 6,000 మంది మహిళలకు గృహప్రవేశ కానుక కిట్‌లు (రూ.60 లక్షలు), పశుగ్రాసం కోసం రూ.65.72 లక్షలు మొత్తంగా రూ.175 కోట్ల ఆర్థిక భారంతో నిర్వాసితుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో మౌలిక వసతుల పనులు తుది దశకు చేరుకున్నాయని, నిబంధనల ప్రకారం 3,961 నిర్వాసిత కుటుంబాలకు, ఓ.టి.ఎస్ కింద 3,300 మందికి పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పట్టాలు సిద్ధంగా ఉన్నందున నిర్వాసితులు వెంటనే వచ్చి స్వీకరించాలని కలెక్టర్ కోరారు. శ్మశాన వాటికలు, అదనపు ప్లాట్ల కోసం 20 ఎకరాల భూసేకరణ నిమిత్తం మరో రూ. 8 కోట్లు వెచ్చించనున్నామని తెలియజేశారు. గవర్నమెంట్ ఎస్ఓపీ మరియు డిజిటల్ డేటాబేస్ ఆధారంగా అర్హులైన ప్రతి ఒక్క పి.డి.ఎఫ్ కుటుంబానికి పూర్తిస్థాయిలో లబ్ధి చేకూరేలా చూస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రాజెక్టును విజయవంతం చేసిన మీడియా మిత్రులకు, సహకరించిన అధికారులకు, ఉద్యోగులకు ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# పెన్షన్ పంపిణీ చేసిన నగరపంచాయతీ కమిషనర్



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 1)**
పొదిలి నగర పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీ ఏరియాలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంగళవారం నగరపంచాయతీ కమిషనర్ రామ్మోహన్‌రావు, మేనేజర్ షేక్షావలి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి మరీ పెన్షన్‌లు పంపిణీ చేశారు.

# పేదల ముఖాల్లో చిరునవ్వులు చూడడమే ప్రభుత్వ ధ్యేయం



దెబ్బతిన్న రోడ్లను సంపూర్ణంగా బాగుచేసి, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా గుంతలు లేని నాణ్యమైన రహదారులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పంచాయతీరాజ్ శాఖ వేగంగా అడుగులు వేస్తోందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఒకవైపు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా అందిస్తూనే, మరొకవైపు మౌలిక వసతుల కల్పనే ప్రధాన ప్రాతిపదికగా అభివృద్ధి పనులను పరుగులు తీయిస్తోందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా రహదారుల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి అర్జున్ నాయక్, తహసిల్దార్ రాజేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.



# ధరల భారాలకు వ్యతిరేకంగా ఐద్వా నిరసన కార్యక్రమాలకు పిలుపు

**ధరల పెరుగుదలను వ్యతిరేకిస్తు కరపత్రం ఆవిష్కరణ**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 1)**
పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలను ప్రభుత్వాలు అదుపు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రచార ఉద్యమంలో భాగం గా మంగళవారం స్థానిక ఎల్బీజీ భవన్ లో కరపత్ర ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు జిల్లా వ్యాప్తంగా ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలను అదుపు చేయటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. నిత్యం పెరుగుతున్న ధరలతో పేద మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడిందని, బియ్యం, మంచి నూనె, పంచదార, కందిపప్పు, ఉల్లిపాయ ధరలు ఆకాశానికి ఎగబాగు తున్నాయని అన్నారు. వాటిని అదుపు చేయాల్సిన ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని అన్నారు. ఈ ధరల భారం ముఖ్యంగా మహిళల మీద పడుతుందని ఇప్పటికే మహిళలు 57 శాతం రక్తహీనతతో బాధపడుతున్నారని, పౌష్టికాహారలేమితో పుట్టే బిడ్డలు ఎదుగుదల లోపంతోనూ, అంగవైకల్యంతోను పుడుతున్నా రని అన్నారు. ప్రపంచంలోనే చెరుకు పండించుటలో రెండవ స్థానంలో ఉన్న మన దేశం ఇప్పుడు పంచదార దిగుమతి చేసుకునే స్థాయికి దిగజారడం సిగ్గుచేటైన విషయమని అన్నారు. ఎగుమతులు, దిగుమతులు మీద పర్యవేక్షణ లేకపోవడం కేంద్రం లో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలే దానికి కారణమని అన్నారు. కార్పొరేట్లకు లాభాలు చేకూర్చేటువంటి ఈ 20 పెట్రోల్‌కు చెరుకును తరలిస్తు దేశ ప్రజలను ఆకలి చావులకు గురిచేస్తుందని అన్నారు. బ్లాక్ మార్కెట్ ను అరికట్టే విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండు విఫలమయ్యాయని అన్నారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు 14 రకాల నిత్యవసర వస్తువులను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధరల భారాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 7న కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో మహిళలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎన్ మాలతి, జిల్లా నాయకులు జి ఆదిలక్ష్మి, బి రాజ్యలక్ష్మి, కె రాజేశ్వరి, బి గోవిందమ్మ, బి రంగమ్మ, జి నాగేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 1)**
ఈ నెల 2వ తేదీ బుధవారం 33/11కేవీ ఉలవపాడు సబ్ స్టేషన్, 33/11కేవీ మన్నేటికోట సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తంగా మన్నేటికోట కొత్తూరు, మన్నేటికోట పాతూరు, సుబ్బరాయుడు సత్రం, రాజుపాలెం, రాజుపాలెం సాయిబాబా గుడి, దాని పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయబడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాల్సిందిగా ఆయన విన్నవించారు.

# నేడు పల్నాడు జిల్లా ముఖద్వారం

**నరసరావుపేటలో మంత్రి నారా లోకేష్ పర్యటన**
**లోకేష్ పర్యటన ఏర్పాట్ల పై**
**పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి సమావేశంలో పాల్గొన్న జీవీ**
**జేఎన్‌టీయు కాలేజీల్లో వసతి గృహాలు ప్రారంభించనున్న మంత్రి లోకేష్**
**పెట్లూరి వారిపాలెం కార్యకర్తలతో సమావేశం కానున్న లోకేష్**
**మంత్రి లోకేష్ పర్యటన విజయవంతం చేయాలని ప్రజలకు జీవీ పిలుపు**



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, సెప్టెంబర్ 1)**
పల్నాడు జిల్లా ముఖద్వారం నరసరావుపేట నియోజకవర్గంలో రేపు మంత్రి వర్యులు నారా లోకేష్ చేపట్టనున్న పర్యటనను విజయవంతం చేసేందుకు పల్నాడు జిల్లా ఎమ్మెల్యేల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొని పర్యటన ఏర్పాట్లు, కార్యక్రమాల నిర్వహణపై ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణుల సమన్వయం, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. లోకేష్ పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలనినాయకులకు సూచించారు.జిల్లా పర్యటనలో భాగంగా జేఎన్‌టీయు కాలేజీల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వసతి గృహాలను మంత్రి నారా లోకేష్ ప్రారంభించనున్నారు. అనంతరం పెట్లూరి వారిపాలెం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్తలతో మంత్రి సమావేశం కానున్నారు.రాష్ట్రంలో విద్యా, ఐటీ రంగాల అభివృద్ధికి మంత్రి లోకేష్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, యువతకు మెరుగైన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. మంత్రి నారా లోకేష్ పర్యటన ద్వారా పల్నాడు జిల్లా సమగ్ర అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు, జిల్లా అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించే అవకాశం ఉన్నందున పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంత్రి నారా లోకేష్ నరసరావుపేట పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జీవీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్ ఛార్జ్ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు , డాక్టర్ అరవిందబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి అనగానితో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

**గుంటూరు ఛానల్ పనులకు వేగం**

**పెండింగ్ భూసేకరణ పూర్తికి రెవెన్యూ మంత్రి ఆదేశాలు**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, సెప్టెంబర్ 1)**
గుంటూరు ఛానల్ పనుల పురోగతి పై కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నివాసంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లతో ఎమ్మెల్యే సమావేశమై, ఛానల్ వైడెనింగ్, మోడర్నైజేషన్, ఎక్స్‌టెన్షన్ పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. గుంటూరు ఛానల్ విస్తరణ, ఆధునికీకరణ పనుల్లో మిగిలిన భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేసి, ప్రాజెక్టుకు వేగం తీసుకురావాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంత్రులను కోరారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించి, ఆధునికీకరిస్తే ఆయకట్టు రైతులకు శాశ్వత త్రాగు, సాగునీటి భద్రత లభిస్తుందని ఎమ్మెల్యే ఏలూరి వివరించారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణలో కొన్ని ప్రాంతాల్లో పెండింగ్ సమస్యను పరిష్కరిస్తే పనులు మరింత వేగంగా ముందుకు సాగుతాయని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. దీనికి వెంటనే రెవిన్యూ మంత్రి అనగాని తక్షణమే స్పందించారు. పెండింగ్ భూసేకరణ అంశాన్ని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), సీసీఎల్ఏతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. గుంటూరు ఛానల్ విస్తరణ పూర్తయితే పర్చూరు ప్రాంతంలో సుమారు 28 వేల ఎకరాలకు సాగునీటి ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఛానల్ వైడెనింగ్, మోడర్నైజేషన్, ఎక్స్‌టెన్షన్ పనులను సమగ్రంగా పూర్తి చేయడంపైనే ప్రధానంగా సమావేశం సాగింది. ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, అవసరమైన అనుమతులు, భూసేకరణ, ఇతర సమస్యలను పరిష్కరించి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదు, రైతుల సాగునీటి అవసరాలను తీర్చడమే నా ప్రధాన లక్ష్యం అని ఎమ్మెల్యే ఏలూరి స్పష్టం చేశారు.

# ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అభివృద్ధిపై చర్చించండి పివి శేషయ్య

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 1)

ఒంగోలు పురపాలక సంఘం ఏర్పడి 2026 సెప్టెంబర్ 30 నాటికి 150 సంవత్సరాలు పూర్తవుతుంది. ఈ సందర్భంగా ప్రభుత్వం, మే 24 నుండి సెప్టెంబర్ 30 వరకు ఐదు నెలల కాలంలో నగరంలో వివిధకార్యక్రమాలు ఉత్సవాలు జరుపుతున్న నేపథ్యంలో 150 సంవత్సరాల్లో నగరాభివృద్ధి ప్రజా సమస్యలపై చర్చించడం సముచితం. ఒంగోలు ప్రాంతం క్రీస్తుపూర్వం నుండి ఉనికిలో ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయని, ప్రాచీన కాలంలో పల్లవులు, ఆ తర్వాత అద్దంకి రెడ్డి రాజుల కాలంలో ఈ ప్రాంతాన్ని వంగోలు తర్వాత వంగవోలు అని పిలిచేవారన్నారు. ఒంగోలు పురపాలక సంఘం చరిత్ర బ్రిటిష్ కాలము నాటిది. ఇది 1876 సెప్టెంబర్ 30 నాటికి మూడో గ్రేడ్ మున్సిపాలిటీగా ఆవిర్భవించి, 1970లో సెకండరీ గ్రేడ్, 1972 శ్రీశీ ఫస్ట్ గ్రేడ్ మున్సిపాలిటీ అయ్యి జిల్లా కేంద్రం పట్టణమైంది. 2012 కార్పొరేషన్ అయింది. ఆనాడు 25 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం.9,000 మంది జనాభా ఉంటే నేడు 134.45 కిలోమీటర్లు విస్తీర్ణం. సుమారు 3,25,000 మంది జనాభా 50 డివిజన్లో 1,20,000 కుటుంబాలు నివసిస్తున్నాయి. నగర ప్రజలకు కనీసం గృహ వసతి, తాగునీరు, ఉపాధి, రోడ్లు, విద్యుత్, విద్య, వైద్యం వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించడంలో పాలకుల కనీస బాధ్యత. ఉత్సవాల పేరుతో లక్షలరూపాయలు వృధా చేసేదానికన్నా ప్రజా సమస్య పరిష్కరించే దానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది.



**నగరంలోని ప్రధాన సమస్యలు..........**

మంచినీటి సమస్యలు పరిష్కారం చేయాలి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి. పోతురాజు కాలవ మురుగులు తొలగించి రెండువైపులా ఆగిపోయిన గోడలను నిర్మించాలి. ఒంగోలు పడమర వైపు రింగురోడ్ ఏర్పాటు చేయాలి. శివారు కాలనీలో సిమెంట్ రోడ్లు వేయాలి. కాలువలు నిర్మించాలి. కార్పొరేషన్ లో పబ్లిక్ టాయిలెట్స్ సక్రమంగా నిర్వహించాలి. ప్రభుత్వ పాఠశాలలు నిర్మించాలి .ఇంజనీరింగ్ డీఈడీ కాలేజీలు నిర్మించాలి. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటు ధరించాలి. యూనివర్సిటీ భవనాలు నిధులు కేటాయించాలి. 20 వేల మంది పేదలకు రెండు సెంట్లు చొప్పున స్థలాలు ఇవ్వాలి. ప్రభుత్వ భూముల నివాసం ఉంటున్నారు పట్టాలి. 4120 మంది టిట్కో లబ్ధిదారులకు అందించాలి. ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి. ఆర్టీసీ బస్టాండ్ ఇన్ అవుట్ గేట్లను మార్చాలి. అవసరమైనచోట స్పీడ్ బ్రేకర్స్ఏర్పాటు చేయాలి. నిబంధన విరుద్ధంగా ఉన్న స్పీడ్ బ్రేకర్లను తొలగించాలి. సిటీ బస్సులు ఏర్పాటు చేయాలి. అద్దంకి బస్టాండ్, నెల్లూరు బస్టాండ్ కొత్తపట్నం బస్టాండ్, మంగమురు రోడ్డు, శ్రీనివాస సెంటర్, బైపాస్ సెంటర్ బస్టాండ్లు ఏర్పాటు చేయాలి. ప్రధాన రహదారులు మాస్టర్ ప్లాన్ కు అనుగుణంగా రోడ్లు వెడల్పు చేయాలి. నెల్లూరు బస్టాండ్ పక్కన ఉన్న స్థలంలో ఓపెన్ థియేటర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆడిటోరియం కట్టించాలి. పాత మార్కెట్ స్థలంలో నగరపాలక సంస్థ నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలి. పాదచారులకు ఫుట్పాత్ నిర్మించాలి. నగరంలోని పార్కుల్లో ఆట వస్తువులు సదుపాయాలు కల్పించాలి. గ్రంధాలయాలు ఏర్పాటు చేయాలి. రంగా రాయుడు చెరువు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, మినీ స్టేడియం దగ్గర వాకర్ టాక్స్ నిర్మించాలి. మంచి నీటి వసతి, టాయిలెట్స్ కట్టించాలి. ఆర్టీసి బస్టాండ్ దగ్గర ఉన్న స్మశానంలోఎలక్ట్రికల్ మిషనరీ వినియోగంలోకి తీసుకురావాలి. రైల్వే ట్రాక్ తూర్పు, కర్నూలు రోడ్డు బైపాస్ రోడ్డు పడమర వైపున ప్రగతి కాలనీ దక్షిణం వైపున మంగమూరు రోడ్డు జంక్షన్ బైపాస్ పడమర వైపు కొత్తగా స్మశానాలకు భూములు కేటాయించాలి. త్రోవగుంట, అంజయ్య రోడ్డు, మంగమూరు రోడ్డు జంక్షన్, పొందూరు రోడ్డు వద్ద అండర్ పాసులు నిర్మించాలి. ఊర చెరువులో పిల్లల పార్క్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేయాలి. ప్రధాన కాలువలు మురుగుబోయే విధంగా లేవు లెవెల్స్ వేసి పారుదల ఉండే విధంగా చేయాలి. అవుట్లెట్ ఏర్పాటు చేయాలి. వాహనాలకు పార్కింగ్ కేటాయించాలని, ఎస్సీ, ఎస్టీ బాల బాలికలకు ప్రభుత్వ హాస్టల్ భవనాలు నిర్మించాలి. దళితవాడలకు సబ్ ప్లాన్ నిధులు వెచ్చిన అభివృద్ధి చేయాలని. రైల్వేస్టేషన్ రెండవ టికెట్ కౌంటర్ కొప్పోలు వైపుఏర్పాటు చేయాలి. స్టేషన్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. రిమ్స్ ఆస్పత్రి సూపర్ స్పెషాలిటీగా మార్చాలి. మంచినీటి సమస్యలు పరిష్కరించాలి. పేషెంట్లు అటెండర్స్ షెడ్డు నిర్మాణం చేయాలి. సెక్యూరిటీ పెంచాలి. నగరపాలక సంస్థ నూతన భవనాన్ని నిర్మించాలి .రెండవ ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలి. నగరపాలక సంస్థ కళ్యాణమండపం, ఆడిటోరియం ఏర్పాటు చేయాలి. అపార్ట్మెంట్లకు నిబంధనల ప్రకారం పర్మిషన్ ఇవ్వాలి. ప్రతిరోజు రాత్రి పూట పోలీస్ నిఘ పెంచాలి. మహిళలకు రక్షణ కల్పించాలి. సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలి. విఐపి రోడ్డును అభివృద్ధి చేయాలి. శ్రామిక నగర్లో పేదలకు రక్షణ కల్పించాలి. యువతకు ఉపాధి కల్పించాలి. పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. రైల్వేస్టేషన్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. కర్నూలు రోడ్డును పొదిలి దాక విస్తరించాలి. ప్రభుత్వ హాస్టల్స్ ట్యూషన్ పాయింట్స్ పెట్టించాలి. ఇంటర్మీడియట్ కు ఫీజు రాయితీ వర్తింప చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని సన్మానించి ఆత్మీయంగా వీడ్కోలు పలికిన ప్రకాశం జిల్లా పోలీసులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 1)

పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఒంగోలు వన్ టౌన్ లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ కె బాబురావు, జిల్లా ఎ ఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న యస్ ఏసోబులను మంగళవారం ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) యుగంధర్‌బాబుతో పాటు ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో సత్కరించి, వెండి జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో చేరిన నాటి నుంచి ప్రజలకు సేవ చేస్తూ గౌరవప్రదంగా ఉద్యోగ విరమణ పొందడం గొప్ప అదృష్టమన్నారు. పోలీసు విధుల నిర్వహణలో కుటుంబానికి దూరంగా ఉండి జిల్లా పోలీసు శాఖకు అందించిన సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని తెలిపారు. సకాలంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకుంటామని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ మిగిలిన జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా మీరు పోలీసు కుటుంబంలో సభ్యులేనని, భవిష్యత్తులో వారికి ఏ సహాయం కావాలన్నా పోలీస్ శాఖ ఎల్లవేళలా వారికి తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యుల యోగక్షేమాలు, పిల్లల విద్య, ఉద్యోగ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీతారామి రెడ్డి, ఆర్ఎస్ఐ తిరుపతి స్వామి, పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ, బాధితుల ప్రాణరక్షణే ధ్యేయంగా కలిసి పని చేద్దాం

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 1)

రోడ్డు ప్రమాదాల నివారణ, బాధితుల ప్రాణరక్షణే ధ్యేయంగా కలిసి పని చేద్దామని 'సేవ్ లైఫ్ ఫౌండేషన్' ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. మంగళవారం ఆ సంస్థ ప్రతినిధులతో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తన నేతృత్వంలో ఎస్పీ, డిటిసి, డిఎంహెచ్వో, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రతినిధులు, ఇతర అధికారులతో కూడిన 'రహదారి భద్రత కమిటీ ' తీసుకుంటున్న చర్యలను, ఫలితంగా వచ్చిన మార్పులను ఈ సందర్భంగా ఆయన వివరించారు. పరిస్థితిని మరింత మెరుగుపరిచేందుకు కలిసివచ్చే సంస్థలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దీనిపై సేవ్ లైఫ్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమ సంస్థ సాంకేతిక సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. జీరో ఫెటాలిటీ డిస్ట్రిక్ట్ (జెడ్ఎఫ్‌డి) లక్ష్యంగా తాము పని చేస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా అధికార యంత్రాంగంతో కూడా పనిచేసేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను అభినందిస్తూ, భవిష్యత్తులో ఎలాంటి సహకారం కావాలన్నా అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో డిటిసి సుశీల, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పింఛన్లతో పేదలకు భరోసా
## కొత్తగా 3500 మందికి పింఛన్లు
## ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 1)

ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను అర్హులైన వారందరికీ ప్రభుత్వం అందిస్తోందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు తెలిపారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొత్తగా 3500 మందికి పింఛన్లు ఇస్తున్నట్లు చెప్పారు. ఒంగోలులోని 8వ డివిజన్ తూర్పు క్రిస్టియన్ పాలెంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందించారు. అనంతరం దామచర్ల మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారందరికీ రూ.4 వేల రూపాయల చొప్పున పింఛన్ ఇస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2600 కోట్ల రూపాయలకు పైగా ప్రతినెలా కేటాయిస్తోందన్నారు. టిడ్కో ఇళ్లను కూడా త్వరితగతిన లబ్దిదారులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అమృత్ 2 కింద పైపు లైన్ పనులను 8వ డివిజన్ నుండే ప్రారంభించనున్నట్లు దామచర్ల తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు ద్వారా పశ్చిమ ప్రాంతం సస్య శ్యామలం అయిందని ఎమ్మెల్యే చెప్పారు. మూడు దశాబ్దాలకు పైగా ఆ ప్రాంత ప్రజలు ఎదురు చూసిన కలల్ని సీఎం చంద్రబాబు నాయుడు నెరవేర్చారన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, మాజీ మేయర్ గంగాడ సుజాత, టీడీపి నగర అధ్యక్షుడు బండారు మదన్, ప్రధాన కార్యదర్శి బొడ్డపాటి వెంకట్, డివిజన్ అధ్యక్షుడు భైరపునేని తిరుపతి రావు, కూరపాటి కాశీరావు, గడ్డం ఆదినారాయణ,మాజీ కార్పొరేటర్లు, తెలుగు మహిళా నాయకురాళ్లు ఆర్ల వెంకటరత్నం, రావుల పద్మజ, బోను దుర్గ, ఉప్పలపాటి నాగేంద్రమ్మ, కే కుసుమకుమారి, పసుపులేటి సునీత, ఈ వీ.ఎస్.లక్ష్మి, శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఇంటర్మీడియట్ వరకు ఫీజు రాయతీ కల్పించాలి



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, సెప్టెంబర్ 1)

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థలలో ప్రకటించిన ఫీజు రాయితీని ఇంటర్మీడియట్ వరకు వర్తింపచేయాలని ఆంధ్ర ప్రదేశ్ జర్నలిస్టు ఫోరం పర్చూరు నియోజకవర్గ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. స్థానిక రోటరీ భవన్ లో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం పర్చూరు నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఫోరం జిల్లా అధ్యక్షులు డి విజయభాస్కర్, సీనియర్ జర్నలిస్ట్ కే ప్రభాకరరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన జర్నలిస్టులందరికీ వర్తింపచేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు పి శివ రాజేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెళ్ళ వంశీకృష్ణ, వ్యవస్థాపక అధ్యక్షులు జి కృష్ణాంజనేయులు సూచనల మేరకు పర్చూరు నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

**నూతన కమిటీ...**

జర్నలిస్ట్ ఫోరమ్ నియోజకవర్గ గౌరవాధ్యక్షులుగా జాన్ సుందరరావు, అధ్యక్షులు ఎన్‌వి రామారావు (అక్షరభూమి, మార్టూరు), ఉపాధ్యక్షులు దండా రామకృష్ణ (99టివి, పర్చూరు), షేక్ మీరావాలి (స్వతంత్ర టివి, పర్చూరు), ఫరీద్ (బిగ్ టివి), ప్రధాన కార్యదర్శి షేక్ అమీన్ బాష (సిటీ న్యూస్), సహాయ కార్యదర్శులు గుమ్మడి హనుమంతరావు (యాద్దనపూడి, సాక్షి), రామకూరు అనిల్ (ఆంధ్రప్రభ, మార్టూరు), కుక్కల శివయ్య (షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం), ట్రజరర్ షేక్ సుభాని (ప్రైమ్ 9, పర్చూరు), కార్యవర్గ సభ్యులు మోహనకృష (ఆంధ్రప్రభ, ఇంకొల్లు), కె విజయ (సత్తెనపల్లి న్యూస్, యద్దనపూడి), పి అయ్యన్న బాబు (గరుడ ప్రభ, మార్టూరు), వలివేటి శ్రీను (అమరావతి న్యూస్, పర్చూరు), బసవరాజు (వార్త, పర్చూరు), షేక్ బాష (హెచ్ఎంటివి, పర్చూరు), శ్రీకాంత్ (వార్త, చిన్నగంజాం), శ్రీనివాసరావు (కారంచేడు)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# రూ.50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ప్రారంభించిన మంత్రి డోలా



(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, సెప్టెంబర్ 1)

సింగరాయకొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని సింగరాయకొండ మరియు మర్రిపూడి మండలాలకు ఈ ఆధునిక హెల్త్ యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటికే సింగరాయకొండలో నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని, త్వరలోనే మర్రిపూడి మండలంలో కూడా భవనాన్ని ప్రారంభించి వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను చెంతకే చేర్చడంలో ఈ బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి వివరించారు. స్థానికంగానే రక్త, మూత్ర పరీక్షలు సహా పలు కీలకమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహించేందుకు అవసరమైన ల్యాబ్ సదుపాయాలు ఈ యూనిట్ ద్వారా అందుబాటులోకి వస్తాయి. అంతేకాకుండా, సీజనల్ వ్యాధులు, అంటువ్యాధుల వ్యాప్తిని ప్రారంభ దశలోనే గుర్తించి నివారించడానికి, అలాగే మండల పరిధిలోని ప్రజల ఆరోగ్య సమాచారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ తగిన నివారణ చర్యలు చేపట్టడానికి ఈ కేంద్రం ఒక ప్రధాన వేదికగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

అనంతరం మంత్రి స్థానిక ఉన్నత శ్రేణి ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వారి పరామర్శించి, లభిస్తున్న వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ ఆసుపత్రి 30 పడకల స్థాయితో ప్రజలకు మెరుగైన సేవలు అందించిందని, అయితే గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దీని స్థాయిని తగ్గించి ఆసుపత్రిని నిర్వీర్యం చేశారని ఆరోపించారు.

ఆసుపత్రిలోని కొన్ని విభాగాలు, గదులు నిరుపయోగంగా మారడం పై త్వరలోనే వీటన్నింటికీ తగిన మరమ్మతులు చేపట్టి పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. భవన మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి తక్షణమే అంచనాలను తయారుచేసి, ప్రభుత్వానికి ప్రపోజల్స్ పంపాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెబుతూ, సంజీవిని ప్రాజెక్ట్ ద్వారా ప్రతి పౌరుడికీ ఉచితంగా ఆధునిక టెలి-మెడిసిన్ మరియు నిపుణులైన వైద్యుల సలహాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అలాగే ఎన్టీఆర్ వైద్య సేవల పరిధిని విస్తరించి పేద కుటుంబాలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత చికిత్సలు అందిస్తున్నామని, అత్యవసర వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక అండగా నిలుస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో జనాభా నిర్వహణ ప్రాధాన్యతను గుర్తించి, ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి ప్రజలంతా పూర్తిస్థాయిలో సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ముగింపుగా, ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ఆయుర్వేద కేంద్రాన్ని కూడా మంత్రి తనిఖీ చేశారు. అక్కడ అందుబాటులో ఉన్న మందుల నిల్వలను, వైద్య సేవలను పరిశీలించిన ఆయన, సాంప్రదాయ వైద్య విధానాల ద్వారా కూడా రోగులకు సమర్థవంతమైన చికిత్స అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహం1 ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్సి కార్పొరేషన్ ఈడి అర్జున్ నాయక్, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్యాధికారులు, పాల్గొన్నారు.



## మండల యూనిట్ సభ్యుల నిరసన కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, సెప్టెంబర్ 1)

ఉద్యోగ, ఉపాధ్యాయ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పై మండల యూనిట్ సభ్యుల నిరసన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చెగిరెడ్డి కోటారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్నామన్నారు. తమకు రావలసిన డబ్బులను తమకు ఇవ్వండి అని స్లొగన్స్ ఇస్తూ తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెల్లారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు కోటారెడ్డి, జనరల్ సెక్రెటరీ కెసిహెచ్ వెంకట్రామయ్య, ట్రెజరర్ నందిరెడ్డి, జలపాటి వెంకటేశ్వర్లు, ఇమ్మడి తిరుపతయ్య, లక్ష్మిరెడ్డి, ఖాశీం, బసిరెడ్డి, తిరుపతి రెడ్డి, బివి రామయ్య, బిబిఎల్ ప్రసాద్, శంకర్‌రెడ్డి, వీరనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ నామినేని కిరణ్ కుమార్ జన్మదినం సందర్భంగా దుప్పట్ల పంపిణీ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 1)

రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్ జన్మదినం సందర్భంగా షెడ్యూల్డ్ హాస్టల్ (బాలికలు)లో విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అంబేద్కర్ భవన్ సమీపంలోని బాలికల హాస్టల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రిమ్స్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు పాల్గొని దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ సునీల్ గవస్కర్, హాస్పిటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 1)

ఏపీజేఏసీ అమరావతి ప్రకాశంజిల్లా అనుబంధం సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం ఉద్యోగులు నల్ల బ్యాడ్జిలు ధరించి విధులకు హాజరు అయ్యారు. 1 నుంచి 5వ తేదీ వరకు నల్ల బ్యాడ్జి పెట్టుకుని విధులకు హాజరు కావాలని, అలానే 3వ తేదీ మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కలెక్టర్ వారి కార్యాలయంలో నిరసన కార్యక్రమానికి ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర ఛైర్మెన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పాల్గొంటారని ఏపీజేఏసీ అమరావతి ప్రకాశం జిల్లా చైర్మన్ జి ఆంజనేయులు తెలిపారు. ఆ కార్యక్రమానికి జిల్లాలోని ఏపీజేఏసీ అమరావతి అనుబంధం సంఘాలు, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పాల్గొంటారని ఊతకోలు శ్రీనివాసరావు తెలిపారు.

## పేదల ఆకలి తీర్చడమే 'అన్నా క్యాంటీన్ల' ప్రధాన లక్ష్యం
## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, సెప్టెంబర్ 1)

రాష్ట్రంలో పేదలు, నిరుపేదలు, దినసరి కూలీలు, సామాన్య ప్రజల ఆకలి తీర్చడమే పరమోచ్ఛ లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేవలం రూ.5 లకే రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించే 'అన్నా క్యాంటీన్ల' వ్యవస్థను పునరుద్ధరించారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. మంగళవారం సింగరాయకొండ మండల కేంద్రంలోని అన్నా క్యాంటీన్‌ను మంత్రి ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ ఆకస్మిక తనిఖీ సందర్భంగా మంత్రి సాధారణ ప్రజలతో కలిసి క్యూలైన్‌లో నిలబడి రూ.5 చెల్లించి భోజనం టోకెన్ తీసుకున్నారు. అనంతరం సామాన్యులతో పాటు కూర్చొని భోజనం చేశారు. భోజనం అత్యంత రుచికరంగా, పౌష్టికంగా ఉందనడానికి స్వయంగా తానే నిదర్శనమని పేర్కొంటూ ఆహార నాణ్యతకు కితాబిచ్చారు. అంతేకాకుండా క్యాంటీన్ లోపల, డైనింగ్ హాల్‌తో పాటు చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు కూడా చాలా శుభ్రంగా, పారిశుధ్య నియమాలకు అనుగుణంగా ఉండటం గమనించి ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ నిర్వహణ సిబ్బందిని అభినందించారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదనే మానవీయ దృక్పథంతోనే ముఖ్యమంత్రి, ఈ మహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించారని మంత్రి వివరించారు. ఈ బృహత్తర యజ్ఞంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా ప్రజలు తమ ఇళ్లలో జరుపుకునే పుట్టినరోజులు, పెళ్లిరోజులు, కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థ వేడుకలు లేదా ఇతర శుభకార్యాల సందర్భాలలో అన్నా క్యాంటీన్లలో పేదలకు భోజన దాతలుగా (అన్నదాతలుగా) ముందుకు రావాలని ఆత్మీయ పిలుపునిచ్చారు. విశేష దినాల్లో నిరుపేదల ఆకలి తీర్చడం వల్ల లభించే తృప్తి వర్ణనాత్మకమైనదని, దాతలు అందించే చిన్న సహకారం కూడా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని అన్నా క్యాంటీన్లలోనూ ఇదే తరహా నాణ్యత, పరిశుభ్రత నిరంతరం కొనసాగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి స్వామి పునరుద్ఘాటించారు.





## సంక్షేమం గడప వద్దకే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే కందుల



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టెంబర్ 1)

మార్కాపురం పట్టణంలోని 33వ వార్డులో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం లబ్ధిదారుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, 33వ వార్డు కౌన్సిలర్ నాలి కొండయ్య యాదవ్‌తో కలిసి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు స్వయంగా పెన్షన్లు అందజేశారు. గడప వద్దకే పెన్షన్ అందడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఇంటి వద్దకే పెన్షన్ అందుతుండటంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయిందని పలువురు వృద్ధులు పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న వారికి ఈ విధానం ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ పాలనను ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగానే పెన్షన్లను పెంచి అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలవడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పటాన్ ఇబ్రహీం, తాళ్లపల్లి సత్యనారాయణ, మయూరి కాసిం, గఫార్, నాసర్, చౌదరి, వెంకటేశ్వర్లు, యోగిరెడ్డి, బాదురయ్య, వెంకట్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవిజయపురంలో (పోర్ట్ బ్లెర్) క్షేత్ర సందర్శన జరిపిన కమిటీ చైర్మన్ మాగుంట






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 1)

ఆధ్యయన సందర్శన కార్యక్రమంలో భాగంగా గృహ, పట్టణ వ్యవహారాల పార్లమెంటు కమిటీ చైర్మన్, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులతో కలసి మంగళవారం కేంద్ర పాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవులలోని శ్రీవిజయపురం నగర్ సిటీలో నూతన సాంకేతిక నగర ప్రాజెక్టు క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్శనలలో సంబందిత అధికారులు కోరిన సదుపాయాలు, చేసిన సూచనలను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని వారికి ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు.

## మర్యాదలేని మాటలొద్దు వ్యాఖ్యలు ఉపసంహరించుకొని జగన్‌కు క్షమాపణ చెప్పాల్సిందే

### మాగుంట పై "అన్నా" ఫైర్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 1) వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం పేరిట సాగిన కార్యక్రమంలో చంద్రబాబు ప్రాపకం కోసం ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పై అనుచితంగా మర్యాద లేని మాట్లాడడం మంచిది కాదని, సభ్యత, సంస్కారం విడిచి చంద్రబాబు భజన చేయడం తగదని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు విమర్శించారు. మార్కాపురం వైఎస్సార్సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాగుంట శ్రీనివాసులురెడ్డి వ్యాఖ్యల పై విరుచుకుపడ్డారు. అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి, తదుపరి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహృదయంతో నీకు సీటిచ్చి ఆదరిస్తే, చేసిన సాయం మరిచి ఇప్పుడు చంద్రబాబు పంచన చేరి మర్యాద లేకుండా మాట్లాడటం తగదన్నారు. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంతటి ఆనందం లేదన్న మాగుంట 2009లో ఎంపిగా,2014లో ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు ఏమి చేశావని నిలదీశారు. 2019లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన సీటు ద్వారానే గెలిచావు కదా జగన్మోహన్ రెడ్డి వెలిగొండకు ఏమీ చేయకపోతే అప్పుడు ఎందుకు అడగలేకపోయావని సూటిగా ప్రశ్నించారు. మన కులపోడని ఓటేస్తే అన్నావు. ఆ ఓట్ల కోసమే కదా నీవు అప్పుడు తాపాత్రయపడింది. ప్రకాశం జిల్లా మాగుంట కుటుంబాన్ని ఏండ్ల తరబడి ఆదరిస్తే ఆ కుటుంబం ప్రకాశం జిల్లాకు ఏమిచ్చిందని నేను ప్రశ్నిస్తే నాపై విమర్శలు చేశారు..ఇప్పుడు కూడా అడుగుతున్నాను..మాగుంట కుటుంబం ప్రకాశం జిల్లాకు ఒరగబెట్టిందేమని. మర్యాద లేని వ్యాఖ్యలను మాగుంట ఉపసంహరించుకొని వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి,వైఎస్సార్సీపీకి బేషరత్ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి న్యాయవాదులు, చిట్‌ఫండ్ సంస్థలు సహకరించాలి






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 1) జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించేందుకు న్యాయవాదులు, చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సహకరించాలని అడిషనల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి సిహెచ్. వి. రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఒంగోలు పట్టణంలోని జిల్లా న్యాయస్థానం ఆవరణలో గల బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సెప్టెంబర్ 12వ తేదీ జరగబోవు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి, ఇరుపక్షాల అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని న్యాయవాదులకు సూచించారు. అనంతరం న్యాయమూర్తి కార్యాలయంలో చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులతో సమావేశమై లోక్ అదాలత్ ద్వారా వివాదాలను సులభతరంగా, తక్కువ ఖర్చుతో, త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని వివరించారు. పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను అధిక సంఖ్యలో లోక్ అదాలత్‌కు తీసుకువచ్చి పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ న్యాయవాదులు పంగులూరు గోవిందయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు చావలి రమేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ రవికుమార్ ఇతర కార్యవర్గం సభ్యులు న్యాయవాదులు సుకన్య తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో అంబేద్కర్ భవన్‌లు నిర్మించాలి

## విదేశీ విద్యార్థుల సంఖ్య పెంచాలి

**ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు ఉద్యోగాలు ఇవ్వాలి**
**స్టేట్ లెవెల్ ఎస్సీ, ఎస్టీ యాక్ట్ వర్క్ షాప్ నిర్వహించాలి**
**దళితులకు స్మశాన భూములు కొనివ్వాలి**
**సాంఘిక సంక్షేమ మంత్రి స్వామితో దళిత నేత నీలం నాగేంద్ర**

(షణ్ముఖ వెలుగు, టంగుటూరు, సెప్టెంబర్ 1) అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో అంబేద్కర్ భవన్‌లు నిర్మించాలని స్టేట్ లెవెల్ ఎస్సీ, ఎస్టీ వర్క్ షాప్ ఎమ్మెల్యేలు, ఎంపీలతో నిర్వహించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మంత్రి స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలోని వారి స్వగృహంలో కలసి రాష్ట్రంలోని దళిత సంక్షేమం ఎస్సీ ఎస్టీ యాక్ట్ అమలు తదితర అంశాలపై 40 నిమిషాల పాటు చర్చించారు. 1991 వ సంవత్సరంలో అంబేద్కర్ శతజయంతి సందర్భంగా జిల్లా కేంద్రాలలో అంబేద్కర్ భవన్ లు ఏర్పాటు చేశారని,35 సంవత్సరాల అవుతున్న అక్కడక్కడ అంబేద్కర్ భవన్ లు ప్రారంభించారే కానీ నేటి వరకు పూర్తి చేయలేదన్నారు.దళితుల సామాజిక చైతన్యం కొరకు వివాహాది శుభకార్యాలకు ప్రతి నియోజకవర్గ కేంద్రాలలో అంబేద్కర్ భవన్ లు ఏర్పాటు చేయాలని నీలం మంత్రితో మాట్లాడారు. అలాగే గడిచిన ఏడేళ్లలో దళిత విద్యార్థులను విదేశాలకు పంపిస్తామని చెబుతూ కేవలం 17 మందిని పంపించారని,దళిత విద్యార్థులని విదేశాలకు పంపించే రూల్స్ మార్చి సరళతరం చేసి విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. అలాగే ఎస్సీ ఎస్టీ చట్టంలో పేర్కొనే జగన్ ప్రభుత్వం ఆపివేసిన ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో దళితులకు స్మశాన భూములు ఇవ్వాలని 2008వ సంవత్సరంలో 1235 జీవో ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చిన రాష్ట్రంలోని సగం గ్రామాలలో ఎస్సీ ఎస్టీలకు స్మశాన భూములు లేని స్థితిలో ఉన్నారన్నారు. చట్ట ప్రకారం ప్రభుత్వ భూములైన ఇవ్వాలి లేకుంటే ప్రైవేటు భూములు కొని అయినా దళితులకు ఇవ్వాలని మంత్రి స్వామికి తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ రిలీఫ్ ఫండ్ కేంద్ర ప్రభుత్వం నుండి మంజూరు చేయించి జిల్లాలకు పంపించి బాధితులకు అందజేయాలన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పినట్లు ఎస్సీ ఎస్టీలకు రెండున్నర సంవత్సరం కావస్తున్న 50 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేస్తూ జీవో ఇవ్వాలన్నారు. ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాక్ పోస్టుల నోటిఫికేషన్ త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి





స్వామికి నీలం వివ రించారు. రాష్ట్రంలో నక్సలైట్లతో ప్రభుత్వ చర్చలప్పుడు ఆమోదించిన కోనేరు రంగారావు కమిటీ జీవోలు అమలు చేయక దళితులను రెవెన్యూ అధికారులు " నక్షత్ర కుళ్లా " వేధిస్తున్నారన్నారు. అంటరానితనం నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన జస్టిస్ పున్నయ్య కమిషన్ జీవోలలో ప్రతి నెల 30వ తేదీన జరపవలసిన సివిల్ రైట్స్ డే కూడా జరపటం లేదన్నారు. ఎస్సీ ఎస్టీ యాక్ట్ కేసుల్లో ముందస్తు ఫైల్ కూడా ఇవ్వకూడదని చట్టం చెబుతుంటే ఎస్సీ ఎస్టీ కేసుల్లో అగ్రకుల ముద్దాయిల ఇళ్లకు వెళ్లి పోలీస్ అధికారులు స్టేషన్ బెయిల్ ఇచ్చి ఎస్సీ ఎస్టీ యాక్ట్ ను అపహాస్యం చేస్తున్నారన్నారు. 2014 తర్వాత 2014 కు ముందు జరిగిన స్టేట్ లెవెల్ ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ సమావేశం 2021 వ సంవత్సరంలో జరిగిందని రెండేళ్లయిన ఇంతవరకు జరపలేదని త్వరలో జరపాలని మంత్రి స్వామిని నీలం నాగేంద్రరావు కోరారు. హాస్టల్లో అభివృద్ధి స్టడీ సర్కిల్లో ఏర్పాటు తదితర అంశాలకు నిధులు విడుదల చేస్తున్నామని ఈనెల 5వ తేదీన జరిగే స్టేట్ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో మీరు చెప్పిన ఎస్సీ ఎస్టీ యాక్ట్ అమలు ఎస్సీ ఎస్టీ పెన్షన్ దళితుల స్మశాన భూములు అంబేద్కర్ ఆడిటోరియం నిర్మాణంపై కూడా ముఖ్యమంత్రితో చర్చిస్తామని మంత్రి డోలా స్వామి దళిత నాయకులతో చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య,కాకుమాను రవి, మాదిగ పరిరక్షణ సమితి కన్వీర్ పత్రా బంగారం, మాల సభ కన్వీనర్ మేడికొండ మురళి, ప్రకాష్, తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ సేవల్లో సమాచార శాఖ పాత్ర అత్యంత కీలకం

**సమాచార శాఖ జోన్4 ఆర్జేడీ ఎం వెంకటేశ్వర ప్రసాద్**





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టెంబర్ 1) అక్షరాస్యత పెంపు, పేదరిక నిర్మూలన, వ్యవసాయాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో సమాచారశాఖ పాత్ర అత్యంత కీలకమని జోన్ 4 ఆర్జేడీ ఎం వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మంగళవారం కడపలోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని జోన్4 ఆర్జేడీ ఎం వెంకటేశ్వర ప్రసాద్ తనిఖీ చేశారు. కార్యాలయంలోని పరిపాలనా అంశాలను పరిశీలించి, శాఖాపరంగా నిర్వహిస్తున్న కార్యకలాపాలు, సిబ్బంది విధులపై వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయ అధికారులు,



సిబ్బందితో సమావేశమై వారి విధులు, బాధ్యతలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో సమాచార శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ముఖ్యంగా అక్షరాస్యత పెంపు, పేదరిక నిర్మూలన, వ్యవసాయాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, వాటి ప్రయోజనాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాలు సమాచార వ్యాప్తికి కీలక వేదికలుగా మారాయని, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, వాటిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా సమాచారాన్ని అందించాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని కోరారు. జోన్ 4 పరిధిలో సమాచార శాఖను మరింత పటిష్టం చేయడంతో పాటు పాత్రికేయులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సిబ్బంది తమ విధులను బాధ్యతతో నిర్వర్తిస్తూ శాఖ ప్రతిష్ఠను పెంపొందించేలా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏడి రమేష్, డీఇఐఇ శ్రీనివాసరావు, పిఆర్వో రవికుమార్, ఏవీఎస్ నాగయ్య, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా తదితరులు ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్లు సదాశివయ్య, ఫోటోగ్రాఫర్ సొహైల్, టైపిస్టులు శ్రీవాణి, వర్ధిని, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మీపతి, అజ్మతుల్లా, టీపీ హరిబాబు, వీరారెడ్డి, విజయ కుమారి, షాహీనా బేగం, ముంతాజ్ బేగం, సునీత, సుభాషిణి, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కల్వకుంట్ల చంద్రసేన గుప్తా 107వ జయంతి వేడుకలు






(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టంబర్ 1) విసిఐ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా మైదుకూరులోని వాసవి క్లబ్, వనితా క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కల్వకుంట్ల చంద్రసేన గుప్తా 107వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా సిల్వర్ స్టార్ కెసిజిఎఫ్ దాత, ఐఈసి ఆఫీసర్ దొంతు సుబ్రమణ్యం సతీమణి వరలక్ష్మమ్మను క్లబ్ ప్రతినిధులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహనీయుడైన కల్వకుంట్ల చంద్రసేన గుప్తా స్మరణ అందరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ క్యాబినెట్ (సర్వీస్) విఎన్5 కెసిజిఎఫ్ శ్రేయోభిలాషి పబ్బతి గోపాల్, రీజినల్ చైర్‌పర్సన్ వంకదారి రవిప్రసాద్, జోన్ చైర్మన్ కరమలపూటి జ్యోతి, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ సంధిపూటి సతీష్ కుమార్, వనితా క్లబ్ ప్రెసిడెంట్ లేపూరి లక్ష్మి, మండల కమిటీ ప్రెసిడెంట్ నూకల సత్యనారాయణ, వాసవి క్లబ్ ట్రెజరర్ చింతకుంట కిషోర్, మాజీ ట్రెజరర్ కుప్పం కృష్ణ కిషోర్, కొప్పరపు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన జిల్లా అధికారులకు, సభ్యులకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

# పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమం

**మాచవరంలో రెండేళ్లలో 17.35 కోట్లతో కార్యక్రమాలు**
**ఓట్లు వేయకపోయినా...అభివృద్ధి చేసి చూపిస్తా**
**మాచవరంలో పెన్షన్ల పంపిణీ**
**ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు**

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 1)**

కూటమి ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని గౌరవ కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కందుకూరు మండలంలోని మాచవరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు పాల్గొన్నారు. గ్రామ శివారులోని ఎస్టీ కాలనీ, కొండదగ్గర ఎస్టీ, బీసీ కాలనీల్లో వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేయడంతో పాటు రాష్ట్రం, కందుకూరు నియోజకవర్గంలో గడచిన రెండేళ్లలో జరిగిన ప్రగతిని వివరించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో మాచవరం పంచాయతీలో రూ.17.35 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసాం. గ్రామంలో ప్రతినెలా 845 మంది లబ్ధిదారులకు పింఛన్ల రూపంలో రూ.34 లక్షలు అందిస్తున్నాం. 143 మహిళా పొదుపు గ్రూపులకు రూ.10.47 కోట్ల రుణాలు అందించాం. జిరాంజీ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1.4 కోట్లను కూలీల ఖాతాల్లో వేసాం. తల్లికి వందనం పథకం ద్వారా 501 మంది తల్లుల ఖాతాల్లో రూ.1.5 కోట్లు, దీపం పథకం ద్వారా రూ.52.19 లక్షలు, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 880 మంది రైతులకు రూ.2.37 కోట్లు అందించాం. ఆటో డ్రైవర్ సేవలో పథకం ద్వారా 6 గురికి రూ.9 లక్షలు ఇచ్చాం. గత ఏడాది రూ.10.3 లక్షలతో 5 గోకులం షెడ్లు నిర్మించగా, ఈ ఏడాది 4 మంజూరయ్యాయి. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పార్టీలకతీతంగా 21 మంది పేదలకు రూ.16.66 లక్షలు సహాయం అందించాం. గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించడంతోపాటు తాగునీటి వసతుల కోసం రూ.6 లక్షలకు పైగా ఖర్చు చేసాం. సాగునీటి కోసం చెరువుకు వచ్చే కాలువ రిపేర్లు, పంట కాలువలు, పాటి కాలువ అభివృద్ధి కోసం రూ.14.5 లక్షలు మంజూరు చేసాం. రాజకీయాలలో మార్పును ఆహ్వానించాలని గ్రామస్తులను కోరుతున్నాను. భయం వదిలి బయటకు రండి. ఏ సమస్య ఉన్నా నేరుగా నా దగ్గరకు నేరుగా రావచ్చు. పనిచేయటానికి సిద్ధంగా ఉన్నాను అని ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టంగా చెప్పారు. రాబోయే రోజుల్లో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. త్వరలో ఎస్సీ కాలనీవాసులకు పట్టాలు పంపిణీ చేయబోతున్నాం. గత ప్రభుత్వంలో పంచాయితీ వ్యవస్థను నిర్వీర్యం చేయడం చూశారు. చిన్నచిన్న పనులకుకూడా డబ్బులు ఉండేవి కావు. కూటమి ప్రభుత్వం ఇస్తున్న నిధులతో గ్రామాలలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. మాచవరం గ్రామ పర్యటనలో ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు ఘన స్వాగతం లభించింది. పూలు, తప్పెట్లతో ఆయనకు పలు కాలనీలవాసులు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ గొంది నరసింగరావు, స్థానిక నాయకులు సూరం చిరంజీవిరెడ్డి, సాదినేని మాల్యాద్రి, రావూరి మహేంద్ర, ఇనకల్లు సుబ్రహ్మణ్యం, అనంత రాగయ్య, శేషయ్య, పరుచూరి మాధవ, బీరం వాసు, లక్ష్మీనారాయణ, తన్నీరు అయ్యలు, చొప్పర మోహన్, ఎండ్లూరి శరత్, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.








# గండిక్షేత్రం శ్రీ వీరాంజనేయస్వామి వారిని దర్శించుకున్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టెంబర్ 1)**

వైఎస్సార్ కడప జిల్లా చక్రాయపేట మండలం, గండిక్షేత్రంలోని ప్రసిద్ధ శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి వారిని మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘన స్వాగతం పలికి, శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం వెలంపల్లి శ్రీనివాసరావు గారు గర్భాలయంలో కొలువైన శ్రీ వీరాంజనేయ స్వామి వారిని దర్శించుకుని, వేద పండితుల ఆశీర్వచనాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆయన స్వామివారిని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గుబ్బ చంద్రశేఖర్, రేపాల శ్రీనివాసరావు, కుప్పం ప్రసాద్, మిట్ట కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.







## ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 1)**

మంగళవారం జిల్లా కలెక్టర్ పి రాజా బాబు సామాజిక పించన్ల పంపిణీ కార్యక్రమములో భాగంగా ఒంగోలు పట్టణంలోని ప్రగతి కాలనీలో పలువురికి యన్‌టిఆర్ భరోసా పించన్లు అందచేసే కార్యక్రమములో పాల్గొని స్వయంగా పలువురికి పించన్లు అందచేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పేద ప్రజలకు నిజమైన వరం అని ఆర్థిక భరోసా కల్పిస్తుందని అన్నారు. వృద్ధ మహిళ బుల్లెమ్మ దివ్యాంగులు వెంకటేశ్వర్లకు, వృద్దుడు అప్పన్నకు నేరుగా వారి ఇళ్లవద్దకు వెళ్లి తమ చేతుల మీదుగా పింఛన్లు అందజేశారు. లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీసారు. అంతే కాకుండా ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఇంట్లో బాగా చూసుకున్తున్నారా అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి సకాలంలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా యంత్రాంగం నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు.

## నేపాల్ మృతులకు నివాళి




**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 1)**

మండలంలోని కరేడు గ్రామం బస్టాండ్ వద్ద మంగళవారం ఇటీవల నేపాల్‌లో భారీ వరదలకు నేపాల్ ప్రజలు, ఇతర దేశాల ప్రజలు వరదలలో కొట్టుకుపోయి మరణించిన సందర్భంగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమానికి 139 బీసీ కులాల జేఏసీ చైర్మన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మిరియం శ్రీనివాసులు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించడం జరిగినది.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# ఉపాధి హామీ పనులు కల్పించండి

## వర్షాలు లేక పొలం పనులు లేక ఇళ్ల వద్దనే ఉంటున్నాం

## ఎంపీడీవోకు అర్జీ అందజేసిన పుల్లలచెరువు ఎస్సీ కాలనీ వాసులు

(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, సెప్టెంబర్ 1)

పుల్లలచెరువు గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన ఉపాధి హామీ కూలీలు తమకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని కోరుతూ మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారికి (ఎంపీడీవో) అర్జీ అందజేశారు. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో వ్యవసాయ పనులు కూడా అందుబాటులో లేవని, దీంతో తాము పనులు లేక ఇళ్ల వద్దనే ఖాళీగా ఉండాల్సి వస్తోందని కూలీలు తెలిపారు. తమకు ఉపాధి కల్పించేందుకు గ్రామంలో ఉపాధి హామీ పనులు వెంటనే ప్రారంభించాలని వారు ఎంపీడీవోను కోరారు. అలాగే ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతూ డిమాండ్ పారం కూడా సమర్పించినట్లు కూలీలు తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తే తమ కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కూలీలు పేర్కొన్నారు.

# వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిది

**జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**

**వచ్చే నెల నుంచి లబ్ధిదారులకు మరింత అందుబాటులో పింఛన్ సేవలు**

**పునరావాస కాలనీల్లో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పన**

**అర్హులందరికీ త్వరలోనే ఇళ్ల పట్టాల పంపిణీ**







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టెంబర్ 1)

లక్షలాది మంది ప్రజల తాగు, సాగునీటి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం పునరావాస గ్రామాల ప్రజలు చేసిన త్యాగం ఎప్పటికీ మరువలేనిదని, వారి సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత స్పష్టం చేశారు. మంగళవారం పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు ప్రభుత్వ పాఠశాల, పుచ్చకాయలపల్లి స్వర్ణ గ్రామ కార్యాలయంతో పాటు మార్కాపురం మండలం కోలభీమునిపాడు స్వర్ణ గ్రామ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాలలో గుండంచర్ల, సుంకేసుల, గొట్టిపడియ గ్రామాల లబ్ధిదారులకు కలెక్టర్ స్వయంగా 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్వాసిత గ్రామ ప్రజలు పింఛన్ల కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే ఈ రోజు ప్రత్యేక కేంద్రాల ద్వారా ఒకేచోట పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. వచ్చే నెల నుంచి లబ్ధిదారులకు మరింత అందుబాటులో, సౌకర్యవంతంగా ఉండే ప్రదేశాలలోనే పింఛన్లు అందజేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పునరావాస కాలనీల్లో ఇప్పటికే పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించామని వివరించారు. ఇంకా ఇళ్ల పట్టాలు అందని అర్హులైన నిర్వాసితులకు అతి త్వరలోనే పట్టాలు పంపిణీ చేస్తామని, ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి భారీ ప్రణాళికలు

## 2028 నాటికి ప్రతి ఇంటికీ శుద్ధ జలాలు
## 2029 నాటికి సమగ్ర అభివృద్ధి
## అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పింఛన్
## ఈ నెల నుంచే అర్హులకు కొత్త పింఛన్లకు దరఖాస్తు స్వీకరణ
## ఇజ్జువరంలో 'పేదల సేవలో' కార్యక్రమంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

(షణ్ముఖ వెలుగు, టెక్కలి, సెప్టెంబర్ 1)

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పిస్తూ పింఛన్ అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'పేదల సేవలో' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను అందజేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ఎన్ఎంబీటీ రోడ్డు వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రహదారులు, ప్రొటెక్షన్ వాల్, కాలువలు, పైపుల కల్వర్టు నిర్మాణాలను మంత్రి ప్రారంభించారు.

**అర్హత ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల నుంచి భర్తను కోల్పోయిన వితంతువులు, దివ్యాంగులు, గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు తొలగించబడిన అర్హులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. అందిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు అక్టోబర్ నెల నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్కరూ పింఛన్ ప్రయోజనానికి దూరం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

**పారిశ్రామిక పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారుతోంది**

**గత 24 నెలల్లో 24 లక్షల కోట్లు పెట్టుబడులకు పారిశ్రామికవేత్తల ముందడుగు**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతర కృషి ఫలితంగా రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి అనుకూల వాతావరణం ఏర్పడిందని మంత్రి తెలిపారు. గత 24 నెలల్లో రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు సుమారు రూ.24 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారని పేర్కొన్నారు. పారిశ్రామిక అభివృద్ధితో పాటు స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

**ప్రతి రైతుకు ఏడాదికి మూడు పంటలకు సాగునీరు**

**నేరడి బ్యారేజీతో 19 టీఎంసీల నీటి నిల్వకు చర్యలు**

రైతాంగానికి సాగునీరు అందించడంలో, ముఖ్యంగా శివారు ప్రాంతాల భూములకు నీరు చేరేలా చేయడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. జిల్లాలో ప్రతి రైతు ఏడాదికి మూడు పంటలు పండించేలా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నేరడి బ్యారేజీ నిర్మాణాన్ని చేపట్టి 19 టీఎంసీల నీటిని నిల్వ చేసి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. మరో రెండేళ్లలో నేరడి బ్యారేజీ నిర్మాణం పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చామని, తద్వారా రైతాంగానికి సాగునీరు అందిస్తున్నామని మంత్రి వివరించారు.





**టెక్కలి నియోజకవర్గానికి అభివృద్ధి పరుగులు**

**10 రైల్వే ఫ్లైఓవర్లకు నిధులు.. మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

టెక్కలి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే క్రాసింగ్ ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో 10 ఫ్లైఓవర్ వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. 2029 నాటికి రాజకీయాలకు అతీతంగా టెక్కలి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో పనిచేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా ప్రజా జీవితంలో లభించిన ప్రతి అవకాశాన్ని ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వినియోగిస్తూ నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.

**2028 నాటికి ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు**

**ప్రతి గ్రామంలో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి చర్యలు**

టెక్కలి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో 2028 నాటికి మంచినీటి పథకం ట్యాంకును నిర్మించి ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన, శుద్ధమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ప్రజలకు అవసరమైన రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం తదితర మౌలిక వసతులను కల్పిస్తూ టెక్కలి నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

**45 కి.మీ. రహదారి విస్తరణకు రూ.50 కోట్లు**

**నరసన్నపేట–వెంకటాపురం రహదారి అభివృద్ధికి కేంద్ర నిధులు**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషితో నరసన్నపేట నుంచి పోలాకి, పిన్నింటిపేట, బోరుభద్ర, నౌపడ మీదుగా వెంకటాపురం వరకు సుమారు 45 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. త్వరలోనే ఈ రహదారి అభివృద్ధి పనులకు పండుగ వాతావరణంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించి పనులకు శ్రీకారం చుడతామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతూ టెక్కలి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం కృష్ణమూర్తి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎం సుధాకర్‌రావు, హేమసుందర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ఎస్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

---

# బీరు బాటిల్‌తో వ్యక్తి పై దాడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 1)

మండలంలోని ఏలూరు గ్రామ సమీపంలో గల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద మీరావలి బీరు బాటిల్ పగులగొట్టి సోము ప్రసాద్ పై దాడికి పాల్పడిన సంఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఏలూరు గ్రామ సమీపంలో ఏలూరు లారీ యూనియన్ అసోసియేషన్ ఆఫీస్ నందు లారీ క్లీనర్లుగా షేక్ మీరావాలి, సోము ప్రసాద్ ఇద్దరు లారీ క్లీనర్లుగా పనిచేస్తున్నారు. మంగళవారం సుమారు సాయంత్రం 5.50 గంటల ప్రాంతంలో లారీ యూనియన్ ఆఫీస్ ఎదురుగా ఉన్నటువంటి అరుగు పై షేక్ మీరావలి నిద్రిస్తుండగా సోము ప్రసాద్ వచ్చి పడుకున్నటువంటి మీరవాలిని నిద్ర లేపాడు. దీంతో మీరావలి ఆగ్రహంతో నిద్ర లేచి పడుకున్న నన్ను ఎందుకు లేపుతున్నావని ఆగ్రహంతో సోము ప్రసాద్ పై దాడి చేశారు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఆగ్రహంతో మీరావలి పక్కనే ఉన్నటువంటి ఖాళీ బీరు సీసాను పగల కొట్టి సోము ప్రసాద్ కడుపులో బీరు బాటిల్‌తో పొడిచాడు. వెంటనే 108 చీమకుర్తి అంబులెన్స్ వారు వచ్చి తీవ్రమైన రక్తస్రావం అయినటువంటి సోము ప్రసాద్‌ను 108 అంబులెన్స్‌లో చీమకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఒంగోలు గవర్నమెంట్ హాస్పటల్ కు తరలించారు. పొదిలి పోలీసు వారు సంఘటనా స్థలానికి చేరుకొని నేరం చేసిన షేక్ మీరావలివు అదుపులోకి తీసుకొని పొదిలి పోలీస్ స్టేషన్‌కు తీసుకొని వచ్చారు. ఈ ఘర్షణలో ఇద్దరూ మద్యం సేవించి ఉన్నారు. పొదిలి ఎస్ఐ సూరెడ్డి రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# వెలిగొండ నిర్వాసితుల సమస్యల పై కలెక్టర్‌ను కలిసిన సీపీఎం బృందం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టెంబర్ 1)

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకుల బృందం జిల్లా కలెక్టర్ విజయ సునీతను కలిశారు. నిర్వాసిత కుటుంబాలకు పూర్తిస్థాయిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని, పునరావాస కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే వెలిగొండ నిర్వాసితుల పరిహారం, పునరావాసం, అర్హుల గుర్తింపు వంటి అంశాల పై ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో సమస్యలను పరిష్కరించకుండా నిర్వాసితుల పై ఒత్తిడి చేయరాదని సీపీఎం నాయకులు పేర్కొన్నారు.

# ప్రొద్దుటూరు అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలి

**నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**
**ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, జేసీ డాక్టర్ నిధీమీనా హాజరు**
**రహదారులు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, గ్రామీణ అనుసంధాన రోడ్లకు అత్యధిక ప్రాధాన్యం**





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టెంబర్ 1)

వాణిజ్యపరంగా కీలకమైన ప్రొద్దుటూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన ప్రొద్దుటూరు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జేసీ డాక్టర్ నిధిమీనా, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి హాజరయ్యారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల వారీగా చేపడుతున్న పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంతో పాటు పరిసర గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రహదారులు, భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల్లో ఎలాంటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు పట్టణాన్ని పరిసర గ్రామీణ ప్రాంతాలతో అనుసంధానించే రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారుల నిర్మాణం, మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ దీపాల ఏర్పాటును పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. పట్టణ విస్తరణకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలను అంచనా వేసి మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

**భూగర్భ డ్రైనేజీకి అత్యంత ప్రాధాన్యం..**

ప్రొద్దుటూరు పట్టణంలో ఎప్పటినుంచో ఉన్న మురుగునీటి పారుదల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను ఆధునిక సాంకేతిక విధానాలతో చేపట్టేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. సుమారు రూ.600 కోట్లతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థతో పాటు 24 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనలపై అధికారులతో చర్చించారు. కొత్తపల్లి ప్రాంతంలో శుద్ధి కేంద్రం ఏర్పాటుకు అవసరమైన భూమి గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి, సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మురుగునీటి పారుదల వ్యవస్థను శాస్త్రీయంగా రూపొందించాలని సూచించారు.

**మున్సిపల్ కార్మికులు ఎఫ్ఆర్ఎస్ అమాలు చేయాలి...**

పారిశుధ్య నిర్వహణపై మున్సిపాలిటీ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారిశుధ్య కార్మికుల హాజరుకు విధిగా ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులకు అందే ప్రతీ పేమెంట్స్ కూడా ఎఫ్ఆర్ఎస్ నమోదు ద్వారానే జరగాలన్నారు.రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అవగాహన పెంపొందించాలి. పట్టణ విస్తరణ, కొత్త నిర్మాణాలు, లేఅవుట్ల అభివృద్ధి నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ నిబంధనల అమలు పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించాలని సూచించారు. ఈ సదస్సులో లేఅవుట్ల అనుమతులు, భవన నిర్మాణ అనుమతులు, రహదారుల ఏర్పాటు, ప్రజా అవసరాల కోసం కేటాయించాల్సిన స్థలాలు, పార్కులు, మౌలిక వసతుల కల్పనతో పాటు పట్టణ ప్రణాళిక నిబంధనలపై రియల్ ఎస్టేట్ వ్యాపారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టేలా ప్రోత్సహించాలని, భవిష్యత్‌లో పట్టణ ప్రణాళికకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**హౌసింగ్ శాఖలో ఆరోపణలపై సమగ్ర విచారణ..**

ప్రొద్దుటూరులో గతంలో పేదలకు మంజూరైన ప్రభుత్వ గృహాల నిర్మాణంలో ఆప్షన్ 1, 2 నిర్మాణాల ఎంపికతో పాటు ఆప్షన్ 3 కేటాయింపుల్లో కాంట్రాక్టర్ల వ్యవహారంలో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలు, అభ్యంతరాలపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్పందించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని, హౌసింగ్ శాఖతో పాటు ప్రైవేటు ఏజెన్సీలకు సంబంధించి అందిన ఫిర్యాదులు, అభ్యంతరాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. విజిలెన్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. అదే సమయంలో నూతన గృహ నిర్మాణ విధానం ప్రకారం ఇప్పటివరకు ఇళ్లు మంజూరు కాని అర్హులందరినీ గుర్తించి ఇంటి పట్టాలు, గృహ నిర్మాణ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అనర్హులను జాబితా నుంచి తొలగించి, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నిబంధనల ప్రకారం గృహ నిర్మాణ సదుపాయం ఖచ్చితంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**తాగునీటి సరఫరా మెరుగుపరచాలి..**

మైలవరం జలాశయం నుంచి ప్రొద్దుటూరు పట్టణానికి తాగునీటి సరఫరా, నీటి నిల్వ కేంద్రాలు, పంపిణీ పైపులైన్ల పరిస్థితిపై కలెక్టర్ సమీక్షిస్తూ అమృత్ పథకం కింద చేపట్టిన తాగునీటి పథకాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, భవిష్యత్ జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

**పరిశ్రమలు, ఉపాధి అవకాశాలపై దృష్టి...**


ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. చౌదూరు వద్ద ఏర్పాటు చేస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పార్కులో ఖాళీగా ఉన్న స్థలాలను పారిశ్రామికవేత్తలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలన్నారు.

**గ్రామీణ ప్రాంతాలకూ సమాన ప్రాధాన్యం...**

పట్టణంతో పాటు ప్రొద్దుటూరు, రాజుపాలెం మండలాల పరిధిలోని గ్రామాల్లో రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలను పట్టణంతో అనుసంధానించే రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, అనుమతులు, ఇతర సమస్యలను త్వరితగతిన పరిష్కరించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ప్రొద్దుటూరు పట్టణాన్ని ఆధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేసి, పరిసర గ్రామాలతో సమగ్ర అనుసంధానం కలిగిన అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు సలహాలు, సూచనలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో రహదారులు, భూగర్భ డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక వసతాలను మెరుగుపరచాలని కోరారు. పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించి, పట్టణం, గ్రామీణ ప్రాంతాల అనుసంధానానికి అవసరమైన రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు పేదల గృహ నిర్మాణం, సాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో శిరీష, ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస విశ్వనాథ్, తహశీల్దార్ ఉదయ్ భాస్కర్, టౌన్ ప్లానింగ్ అధికారి కృష్ణసింగ్, అన్నిశాఖల జిల్లాస్థాయి, డివిజనల్, నియోజకవర్గ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సంతృప్తికర సేవలే ప్రభుత్వ లక్ష్యం

**మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస విశ్వనాథ్**
**ప్రొద్దుటూరులో పారదర్శకంగా 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ**
**నెలకు 14,094 మంది లబ్ధిదారులకు రూ. 6.21 కోట్ల నగదు పంపిణీ**
**ఇంటి వద్దకే పింఛన్ల బట్వాడా**
**క్షేత్రస్థాయిలో కమీషనర్ తనిఖీ**





(షణ్ముఖ వెలుగు, ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 1)

ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రొద్దుటూరు పురపాలక సంఘం కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 6వ వార్డు సచివాలయ పరిధిలోని 'డ్రైవర్ కొట్టాల' ప్రాంతంలో జరుగుతున్న 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి, పింఛన్ సక్రమంగా అందుతుందో లేదో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ పట్టణంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరగాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను సొమ్మును అందజేయాలని, ప్రజలతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని స్పష్టం చేశారు.

**రూ.6.21 కోట్లతో సామాజిక భద్రత**

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత, మత్స్యకార కార్మికులు, డప్పు కళాకారులు, అలాగే తలసీమియా, కిడ్నీ, లివర్ వ్యాధిగ్రస్తులతో సహా 20 రకాల సామాజిక భద్రతా పింఛన్లను అందజేస్తున్నామని తెలిపారు. మొత్తం 14,094 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా రూ. 6 కోట్ల 21 లక్షల నగదును పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడానికి మున్సిపల్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ పర్యటనలో భాగంగా డ్రైవర్ కొట్టాలకు చెందిన దివ్యాంగులు మహబూబ్, సుబ్బారాయుడులకు కమీషనర్ చేతుల మీదుగా పింఛను నగదును అందజేసి వారి యోగక్షేమాలు విచారించారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మైదుకూరులో అత్యంత వేడుకగా డ్రైవర్ల దినోత్సవం

**కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్న సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్**



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టెంబర్ 1)

సమాజ గమనంలో కీలక పాత్ర పోషిస్తూ, రాత్రింబవళ్లు శ్రమిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే డ్రైవర్ల సేవలు వెలకట్టలేనివని మైదుకూరు సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు కొనియాడారు. సెప్టెంబర్ 1 'డ్రైవర్స్ డే' సందర్భంగా వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరు పట్టణంలోని కడప రోడ్డు స్టాండ్ ప్రాంగణంలో "మైదుకూరు సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్" ఆధ్వర్యంలో డ్రైవర్ల దినోత్సవ వేడుకలను మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉదయం 10 గంటలకు స్టాండ్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, వాహన యజమానులు (ఓనర్లు) మరియు డ్రైవర్లు అందరూ ఒకే వేదికపైకి చేరి కలిసికట్టుగా కేక్ కట్ చేశారు. అనంతరం ఒకరికొకరు కేక్ తినిపించుకుని, డ్రైవర్స్ డే శుభాకాంక్షలు తెలుపుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సైతం ప్రాణాలను పణంగా పెట్టి, బాధ్యతాయుతంగా వాహనాలను నడుపుతూ ప్రయాణికులను క్షేమంగా చేర్చే డ్రైవర్ల శ్రమ అభినందనీయమని అన్నారు. రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ, ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యజమానులకు, డ్రైవర్లకు మధ్య ఉన్న అనుబంధం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు, యజమానులు, డ్రైవర్లు శంకర్ రెడ్డి, యాపరల శ్రీను, రఫీ, శ్రీను, సురేంద్ర, దాసు, రాజేష్, సుబ్బారాయుడు, అనిల్, బ్రహ్మంలతో పాటు పలువురు డ్రైవర్లు, అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గుంటూరు ఛానల్ రైతులకు ఎమ్మెల్యే "ఏలూరి" భరోసా

**ఛానల్‌ను పూర్తి చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కృషి**
**గుంటూరు ఛానల్ పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదే**
**భూ సేకరణ గెజిట్ నోటిఫికేషన్ కు రెవిన్యూ మంత్రి అనగాని ఆదేశాలు**
**అపోహలకు తావులేదు..10 రోజుల్లో భూసేకరణకు గెజిట్ నోటిఫికేషన్**
**రాజమోహన్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేసిన ఎమ్మెల్యే ఏలూరి**





(షణ్ముఖ వెలుగు, పర్చూరు, సెప్టెంబర్ 1)

ఏళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న గుంటూరు ఛానల్ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయించి రైతుల కలను సాకారం చేస్తామని, సీఎం చంద్రబాబు ప్రభుత్వం రైతన్నం కోసం పనిచేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. గుంటూరు ఛానల్ విషయంలో ప్రభుత్వం చాలా స్పష్టంగా ఉందని ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వాన్నిదేనని స్పష్టం చేశారు. సీసీఎల్ఏ నుంచి ఫైలు ప్రభుత్వానికి వెళ్లిందని ప్రభుత్వం ఈ అంశంలో స్పష్టతతో ఉందన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ గుంటూరు ఛానల్ భూసేకరణ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేలా సీసీఎల్ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) జయలక్ష్మి, సీసీఎల్ఏ జాయింట్ కమిషనర్ చేతన్, రెవెన్యూ శాఖ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. భూసేకరణ నోటిఫికేషన్ 10 రోజుల్లో వచ్చేలా కృషి చేస్తానని" అని రైతులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వంలో జరుగుతున్న క్రమాన్ని వివరించేందుకే స్పష్టతతో వచ్చానని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. గుంటూరు ఛానల్ ను పర్చూరు వరకు తీసుకువచ్చి తాగునీరు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే ఏలూరి స్పష్టం చేశారు. గుంటూరు ఛానల్ గుంటూరు ఛానల్ కోసం దీక్ష చేస్తున్న నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు రాజమోహన్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. రైతాంగ ప్రయోజనాల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. ప్రాజెక్టు విషయంలో గుంటూరు ఛానల్ పనులను పూర్తి చేసి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గుంటూరు ఛానల్ నిర్మాణం సుమారు 25 కిలోమీటర్ల మేర ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి వివరించారు. ఇందులో దాదాపు 20 కిలోమీటర్లు గుంటూరు జిల్లా పత్తిపాడు నియోజకవర్గ పరిధిలో, మరో ఐదు కిలోమీటర్లు పర్చూరు నియోజకవర్గ పరిధిలో ఉన్నాయన్నారు. ప్రాజెక్టును రెండు భాగాలుగా విభజించి పనులు చేపట్టే విధంగా ప్రక్రియ కొనసాగుతోందన్నారు. సుమారు ఏడేళ్ల తర్వాత కూడా గతంలో నిర్ణయించిన ధరలకే పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రావడం ప్రాజెక్టుకు కలిసొచ్చే అంశమన్నారు. మళ్లీ రీటెండర్ నిర్వహిస్తే కనీసం ఏడాది సమయం వృథా అయ్యే అవకాశం ఉందని, అందువల్ల అదే కాంట్రాక్టర్‌తో పనులు కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే ఏలూరి చెప్పారు.

**గత ప్రభుత్వ హయాంలో ఒక్క అడుగూ పడలేదు..**

తెలుగుదేశం ప్రభుత్వ హయాం 2018లో గుంటూరు ఛానల్‌కు సంబంధించిన ప్రక్రియ దాదాపు పూర్తయిందని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం టెండర్లను రద్దు చేసి రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టును నిలిపివేసిందని పేర్కొన్నారు. ఐదేళ్ల కాలంలో ప్రాజెక్టులో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. మధ్యలో ఐదేళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. గత ప్రభుత్వం ప్రాజెక్టును పట్టించుకోలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో గుంటూరు ఛానల్‌ను తిరిగి గాడిలో పెట్టేందుకు అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గత రెండు ఏళ్లుగా ప్రభుత్వం గుంటూరు ఛానల్ను ట్రాక్ లో పెట్టేందుకు నిరంతరం పని చేస్తుందన్నారు.